పెన్ పవర్
తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు
12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 13 సంచిక : 45 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 19 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥
VOLUME :13 ISSUE :45 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 19 OCTOBER 2026 PRICE : 1/- RS
Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# ప్రజాస్వామ్యాన్ని కాపాడండి..

## గవర్నర్‌ను కలిసిన జగన్

- స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార పక్షం అక్రమాలకు పాల్పడుతోందని ఫిర్యాదు
- ఎన్నికల ప్రక్రియకు కేంద్ర బలగాల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- ఓటమి భయంతోనే చంద్రబాబు దాడులు చేయిస్తున్నారని ఆరోపణ
- ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపరమైన పోరాటం చేస్తామని స్పష్టీకరణ



రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కోరారు. ఆదివారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార కూటమి అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడుతోందని, ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. సమావేశం అనంతరం జగన్ మీడియాలో

- మిగతా 2లో

### నామినేషన్ల గడువు ముగుస్తోంది.. వెంటనే ఈసీ జోక్యం చేసుకోవాలి: జగన్

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పునేఠాను కలిసిన జగన్
- స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ దౌర్జన్యాలకు పాల్పడుతోందంటూ ఫిర్యాదు
- నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణ
- టీడీపీ కార్యకర్తలకు పోలీసులు సహకరిస్తున్నారని ఫిర్యాదు

- మిగతా 2లో






# ఏపీలో మున్సిపల్ ఎన్నికలు..

## ముగిసిన నామినేషన్ల గడువు

- చివరి రోజు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు
- దర్శిలో సమయానికి చేరుకోలేక 25 మంది వైసీపీ అభ్యర్థుల వెనుదిరిగిన వైనం
- అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, 28న పోలింగ్
- అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ ముగిసింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు విధించిన గడువు ఆదివారం (అక్టోబర్ 18) మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. చివరి రోజు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో కిటకిటలాడాయి. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి కార్యాలయ ప్రాంగణాల్లో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు జారీ చేసి, వారి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో పురపోరు రసవత్తరంగా మారనుంది.

### దర్శిలో వైసీపీకి ఎదురుదెబ్బ

ప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీకి ఊహించని పరిణామం ఎదురైంది. గడువు ముగియడంతో దాదాపు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారు. సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోవడంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది.

### తదుపరి షెడ్యూల్ ఇదే

నామినేషన్ల పర్వం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది.

- మిగతా 2లో

# ప్రజల దృష్టి మళ్లించేందుకే రాష్ట్రపతి పాలన డిమాండ్



- వైసీపీనే క్షేత్రస్థాయిలో గొడవలు సృష్టిస్తోందని పల్లా ఆరోపణ
- జగన్‌పై ఉన్న కేసులను గుర్తు చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు
- స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలంటూ వైసీపీ చేస్తున్న డిమాండ్, ప్రజల దృష్టిని మళ్లించేందుకు పన్నిన రాజకీయ ఎత్తుగడ అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. ఒకవైపు క్షేత్రస్థాయిలో ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టిస్తూ, మరోవైపు శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించడం వైసీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మండిపడ్డారు. జగన్‌రెడ్డితో పాటు వైసీపీ నేతలపై ఉన్న క్రిమినల్ కేసుల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ఈ డ్రామా ఆడుతున్నారని పల్లా ఆరోపించారు. అక్రమాస్తుల కేసులో జగన్‌రెడ్డి 16 నెలల పాటు జైలులో ఉన్న విషయాన్ని,

- మిగతా 2లో



## ప్రజాస్వామ్యంపై మీరు నీతులు చెప్పడమా?: జగన్‌కు అచ్చెన్నాయుడు కౌంటర్

- జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు
- 2021 స్థానిక ఎన్నికల్లో జరిగిన దాడులకు జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్
- నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పదవీకాలం తగ్గింపు ఆర్డినెన్స్‌ను గుర్తు చేసిన మంత్రి
- బెదిరింపుల వల్లే నాడు ఎన్నికలను బహిష్కరించాల్సి వచ్చిందని వెల్లడి
- ఎన్నికల హింసపై నిష్పాక్షిక విచారణ జరిపిస్తామని హామీ

2లో

## మున్సిపల్ ఎన్నికలు: వైసీపీ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

- స్థానిక ఎన్నికల నామినేషన్ల గడువు విషయంలో వైసీపీకి చుక్కెదురు
- గడువు ముగియడంతో పిటిషన్ నిరర్థకమని తేల్చిచెప్పిన న్యాయస్థానం
- నామినేషన్ల తొలిరోజు హింసాత్మకం
- అధికార పార్టీ నేతలు అడ్డుకుంటున్నారని వైసీపీ ఆరోపణలు
- ఘర్షణల నేపథ్యంలో ఎంపీ మిథున్ రెడ్డి సహా 70 మందిపై కేసులు

- మిగతా 2లో





## ఫ్రాన్స్‌లో హింసాత్మక నిరసనలు.. 143 ఏళ్ల చారిత్రక భవనానికి నిప్పు

- ఫ్రాన్స్‌లో హింసాత్మకంగా మారిన జీవన వ్యయ నిరసనలు
- 143 ఏళ్ల నాటి లిమోజెస్ టౌన్ హాల్ భవనాన్ని దగ్ధం చేసిన ఆందోళనకారులు
- దేశవ్యాప్తంగా 1200 మంది అరెస్ట్, 150 మంది పోలీసులకు గాయాలు
- వలస విధానాలే హింసకు కారణమంటూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్య
- హింసకు తావులేదంటూ ఖండించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్

- మిగతా 2లో



## బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ లక్ష్యంగా కాల్పులు

పెన్ పవర్ డెస్క్:బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ వాహనంపై కాల్పులు జరిగాయి. ఆదివారం సాయంత్రం ఆయన ముంబయిలోని జుహూ ప్రాంతంలో కారులో వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఈ దారుణానికి తెగబడ్డారు. బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు

- మిగతా 2లో

## వలసలే ఫ్రాన్స్‌లో అల్లర్లకు కారణం.. తక్షణమే బోర్డర్స్ క్లోజ్ చేయండి



పెన్ పవర్ డెస్క్: ఫ్రాన్స్‌లో తీవ్రరూపం దాల్చిన అల్లర్లపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫ్రాన్స్‌లో నిరసనలు, అల్లర్లకు అనియంత్రిత వలసలే కారణమని పేర్కొన్నారు. ఇతర దేశాల నుంచి ఫ్రాన్స్‌కు వచ్చిన వలసదారులు తమ హృదయాల్లో ద్వేషాన్ని నింపుకుని ఒకప్పుడు ఎంతో గొప్పగా ఉన్న దేశాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఫ్రాన్స్ తక్షణమే తన సరిహద్దులను మూసివేసి వలసలను అదుపు చేయాలని సూచించారు.

- మిగతా 2లో

## విదేశీ సంస్థలకు రహస్య సమాచారం.. పోలీసుల అదుపులో ఆర్మీ అధికారి భార్య



- మిగతా 2లో

## రష్యాపైకి 1,000కిపైగా డ్రోన్లు.. మంటల్లో ఇంధన టెర్మినల్

రష్యాపై ఉక్రెయిన్ భారీస్థాయిలో విరుచుకుపడింది. ఏకకాలంలో వెయ్యికిపైగా డ్రోన్లను ప్రయోగించింది. ఉక్రెయిన్ జరిపిన అతిపెద్ద వైమానిక దాడుల్లో ఇది ఒకటి. ఈ డ్రోన్ల దాడిలో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఓ ఇంధన టెర్మినల్

- మిగతా 2లో





## భారత్ విషయంలో ఆ రోజు హద్దులు దాటి మాట్లాడాను

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

# ప్రజాస్వామ్యాన్ని కాపాడండి..

- మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంతటి అప్రజాస్వామిక వాతావరణాన్ని తానెప్పుడూ చూడలేదని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం కేంద్ర బలగాల పర్యవేక్షణలో, సీసీటీవీ కెమెరాల నిఘాలో జరిపేలా చూడాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. వైసీపీ అభ్యర్థులను నామినేషన్ కేంద్రాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, అదే సమయంలో టీడీపీ మద్దతుదారులను లోపలికి అనుమతించి దాడులు చేయిస్తున్నారని గవర్నర్‌కు వివరించినట్లు చెప్పారు. ఈ అరాచకాలకు పోలీసులు కూడా అధికారపక్షానికే మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని, మరో 19 చోట్ల కేవలం 36 శాతం నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 8 ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేశారని తెలిపారు. పులివెందులలో 36 వార్డులకు గాను కేవలం 19 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ ఎంపీలు అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి పట్ల వ్యవహరించిన తీరు, అభ్యర్థులపై పోలీసుల కాల్పులు, తప్పుడు కేసులు బనాయించడం వంటి అంశాలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. క్రియాశీలకంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను భయపెట్టేందుకు బైండోవర్ కేసుల కుట్ర జరుగుతోందని జగన్ ఆరోపించారు. "ఓటమి భయంతోనే చంద్రబాబు ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారు. పోటీ చేయాలనుకునేవారికి అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. దీనిపై న్యాయపరమైన మార్గాలతో సహా అన్ని అవకాశాలను అన్వేషిస్తాం" అని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా పోరాడాలని, త్వరలోనే పరిస్థితులు మారతాయని ఆయన పిలుపునిచ్చారు.

**ఈసీల నియామకంపై తప్పుచేశాం: పశ్చాత్తాపం వ్యక్తం చేసిన జగన్**

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర కమిషనర్ల నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకొచ్చిన చట్టానికి అప్పట్లో మద్దతివ్వడం తాము చేసిన పెద్ద తప్పిదమని, అందుకు ఇప్పుడు చింతిస్తున్నామని జగన్ విచారం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న పార్టీయే ఎన్నికల కమిషనర్లను నియమించే ప్రక్రియను నియంత్రించకూడదని, ఈ విధానంపై ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నామని ఆయన అన్నారు. అంతకుముందు ఎస్ఈసీ అనిల్ పునేఠాను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ జగన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

కేంద్రంలో అయినా, రాష్ట్రంలో అయినా ఎన్నికల కమిషనర్లను అధికార పార్టీ నామినేట్ చేయకూడదని జగన్ స్పష్టం చేశారు. "గతంలో కేంద్రంలో అధికార పార్టీయే ఎన్నికల కమిషనర్‌ను నామినేట్ చేసే విధానానికి వైసీపీ మద్దతు ఇచ్చింది. కానీ ఆ రోజు మేము చేసిన తప్పుకు ఇప్పుడు బాధపడుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. "పరీక్ష రాసే విద్యార్థే తనకు ఇన్విజిలేటర్‌ను నియమించుకున్నట్లుగా ఈ విధానం ఉంది. ఎంత నిజాయతీపరుడైన అధికారి అయినా, నియామకం నిష్పక్షపాతంగా జరగనప్పుడు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని జగన్ అభిప్రాయపడ్డారు.

ప్రస్తుత నియామక పద్ధతిలో లోపాలున్నాయని జగన్ వివరించారు. ఈ విధానంలో ప్రధానమంత్రి, ఆయన నామినేట్ చేసిన మరో మంత్రికి రెండు ఓట్లు, ప్రతిపక్ష నేతకు ఒక ఓటు ఉంటుందని, దీంతో ప్రభుత్వానికి అనుకూలమైన వ్యక్తే కమిషనర్‌గా నియమితులవుతారని తెలిపారు. ఈ వ్యవస్థలో ఉన్న లోపాన్ని తాము తప్పు చేసిన తర్వాతే గ్రహించామని అన్నారు. ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను కాపాడటానికి పాత పద్ధతినే పునరుద్ధరించాలని, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ద్వారానే ఈసీలను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కమిటీలో సీజేఐ ఉండటం వల్ల నియామక ప్రక్రియ నిష్పక్షపాతంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నియామకంలో కూడా ఇదే తరహా సంస్కరణలు తీసుకురావాలని జగన్ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా టీడీపీ ప్రభుత్వం ఎస్ఈసీని నియమించకూడదని ఆయన స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అధికార టీడీపీ కూటమి అడ్డుకుంటోందని ఆరోపిస్తూ, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాను కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం జగన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ఎస్ఈసీని ముఖ్యమంత్రి చంద్రబాబే నియమించారని, ఆయన ఆదేశాల మేరకే ఎస్ఈసీ పనిచేస్తున్నారని జగన్ ఆరోపించారు.

## వలసలే ఫ్రాన్స్‌లో అల్లర్లకు కారణం.. తక్షణమే బోర్డర్స్ క్లోజ్ చేయండి

- మొదటి పేజీ తరువాయి

విద్యార్థుల ఆందోళనతో మొదలై.. దేశవ్యాప్త ఉద్యమంగానిరసనలు, అల్లర్లతో ఫ్రాన్స్ అట్టుడికిపోతుంది. దేశంలో నిత్యవసరాల పెరుగుదల, పాఠశాలల్లో పరిస్థితులు దిగజారడం, విద్యా సదుపాయాల కొరత వంటి సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున రోడ్డెక్కారు. ఒక ప్రాంతంలో ప్రారంభమైన నిరసనలు క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరించాయి. జీవన వ్యయాలు పెరగడం, ప్రజా సేవల నాణ్యత తగ్గడం, ఆర్థిక ఇబ్బందులపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదన్న అసంతృప్తితో కార్మిక సంఘాలు, ఇతర వర్గాలు కూడా ఉద్యమంలో చేరాయి.పారిస్?లో ప్రధాన ర్యాలీ ప్రశాంతంగానే సాగింది. కానీ పలుచోట్ల నిరసనకారులు ఆగ్రహానికి గురికావడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. నిరసనకారులు వీధుల్లో నిప్పు పెట్టడంతో పాటు వాహనాలను, ప్రభుత్వ భవనాలను తగులబెట్టారు. ప్రముఖ ప్రాంతమైన ప్లాస్ ద లా రిపబ్లిక్ సమీపంలోనూ వాహనాలకు నిప్పంటించారు. అనంతరం పోలీసులకు, నిరసనకారులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లను ప్రయోగించారు. పోలీసులు నిరసనకారులపైకి దూసుకెళ్లి లాఠీలతో కొడుతున్న దృశ్యాలు కూడా వెలుగులోకి వచ్చాయి.

**నిరసనలకు కారణం వలసలు కాదు**

ఫ్రాన్స్?లో అంతర్గత నిరసలు, అల్లర్లకు వలసలే కారణమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పదే పదే చెబుతున్నారు. కానీ అల్లర్లపై ఫ్రాన్స్ ప్రభుత్వం, నిరసనకారుల వాదన మరోలా ఉంది. దేశంలో అల్లర్లకు వలసలు కారణం కాదని.. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, ఆర్థిక ఇబ్బందులు, నిత్యవసరాల పెరుగుదలే కారణమని ప్రభుత్వం, నిరసనకారులు చెబుతున్నారు. దేశంలో ప్రస్తుతం జరుగుతోన్న నిరసనలకు వలసలతో లేదా మరే ఇతర మతపరమైన అంశాలతో సంబంధం లేదని ఫ్రాన్స్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

## భారత్ విషయంలో ఆ రోజు హద్దులు దాటి మాట్లాడాను: జేడీ వాన్స్

కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, హెచ్‌సీఎల్, క్యాప్‌జెమిని కంపెనీలను పర్మ్ (పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్) నుంచి సస్పెండ్ చేసిన సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై తాజాగా ఓ సమావేశంలో మాట్లాడుతూ పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. "భారత్ విషయంలో ఆ రోజు నేను హద్దులు దాటి మాట్లాడాను. 'విదేశీ ఒప్పంద పనివాళ్లు' అని నేను వాడిన పదం సరైనది కాదు. ఎ-1దీ వీసాదారులను లక్ష్యంగా చేసుకోవాలనేది నా ఉద్దేశం కాదు" అని స్పష్టత ఇచ్చారు. "ఆ రోజున అమెరికా కంపెనీలు, వీసా వ్యవస్థ గురించి మాట్లాడాలనుకున్నాను. ఉద్యోగులు అమెరికాకు హెచ్ 1బీ వీసాపై వస్తారు. వారిని తీసుకున్న కంపెనీలు ఆ పనికి ప్రత్యామ్నాయ అమెరికన్ కార్మికుడు దొరకలేదని అంటున్నాయి. దీంతో స్థానికులకు అవకాశాలు దక్కడం లేదు. దేశంలో తరచుగా ఇదే జరుగుతోంది. అందుకే ఆ విధంగా మాట్లాడాల్సి వచ్చింది" అని వాన్స్ పేర్కొన్నారు.

**నాడు వాన్స్ ఏమన్నారంటే..?**

హెచ్ 1బీ వీసాలపై నియమించుకునే విదేశీ ఉద్యోగులను 'విదేశీ ఒప్పంద పనివాళ్లు'గా, ఆ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకునే కంపెనీలను 'వీసా మిల్లులు'గా వాన్స్ అభివర్ణించారు. ఆయన వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర అభ్యంతరం తెలిపింది. నిపుణుల తరలింపుతో భారతీయులకు అవకాశాలు కల్పించడంతో పాటు అమెరికా కంపెనీల సంపదను కూడా పెంచుతోందని పేర్కొంది. ఆవిష్కరణలు, పరిశోధన, ఉత్పాదకత, పోటీతత్వం, ఉద్యోగకల్పన వంటి విషయాల్లో కంపెనీలకు అత్యాధునిక ప్రతిభ ఎంతో సహాయకారిగా ఉందని వ్యాఖ్యానించింది. ఈ విషయంపై వాన్స్ అనవసరంగా మాట్లాడారని అభిప్రాయపడింది.

## రష్యాపైకి 1,000కిపైగా డ్రోన్లు.. మంటల్లో ఇంధన టెర్మినల్

- మొదటి పేజీ తరువాయి

మంటల్లో చిక్కుకుపోయింది. రష్యా చమురు మౌలిక సదుపాయాలను కీవ్ లక్ష్యంగా చేసుకోవడాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శిస్తున్న తరుణంలోనే తాజా దాడులు జరగడం గమనార్హం. ఉక్రెయిన్ దాడుల్లో ఒకరు మృతి చెందగా.. మరో ఐదుగురు గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. పీటర్స్‌బర్గ్ ఆయిల్ టెర్మినల్‌తోపాటు రూచి ఆయిల్ డిపోలో మంటలు చెలరేగాయని చెప్పారు. ఓజోన్ లాజిస్టిక్స్ కేంద్రం, వీకే డేటా సెంటర్‌పైనా దాడులు జరిగాయన్నారు. మొత్తం 1,015 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. మరోవైపు.. ఉక్రెయిన్‌లోని జపోరిజియాపై రష్యా జరిపిన దాడుల్లో ఒక మహిళ ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ట్రంప్ 'ఇంధన కాల్పుల విరమణ' ప్రకటించిన వారం రోజుల్లోనే తమ ఇంధన, చమురు, గ్యాస్ సదుపాయాలపై రష్యా 76 సార్లు దాడులకు తెగబడిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. విద్యుత్ బ్లాక్‌అవుట్ సృష్టించేందుకు మాస్కో యత్నిస్తోందని 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. ఆంక్షల సడలింపులు, ఒప్పందాలకు అనుగుణంగా రష్యా ఎటువంటి సానుకూల చర్యలు తీసుకోవడం లేదనే వాస్తవాన్ని అమెరికా గుర్తించాలన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు: వైసీపీ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై నెలకొన్న రాజకీయ వేడి నేపథ్యంలో, వైసీపీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నామినేషన్ల దాఖలుకు గడువును పొడిగించాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన హౌస్ మోషన్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది.

వివరాల్లోకి వెళితే, నామినేషన్ల స్వీకరణకు నిర్దేశించిన గడువు ఇప్పటికే ముగిసిపోయిందని, అందువల్ల ఈ పిటిషన్ విచారణకు అర్హత కోల్పోయిందని (నిరర్థకం) హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత తాము సాధారణంగా జోక్యం చేసుకోబోమని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. దీంతో నామినేషన్ల గడువు పొడిగింపు కోసం వైసీపీ చేసిన ప్రయత్నం విఫలమైంది.

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తొలి రోజైన శుక్రవారం పుంగనూరులో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు జరిగాయి. ఈ ఘటనలకు సంబంధించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డితో పాటు సుమారు 70 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా, సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి పుంగనూరు పట్టణంలోకి ప్రవేశించకుండా పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు. ఈ పరిణామాలపై స్పందించిన ఎంపీ మిథున్ రెడ్డి, అధికార పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గేది లేదని, అభ్యర్థుల హక్కుల కోసం న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## ఫ్రాన్స్‌లో హింసాత్మక నిరసనలు.. 143 ఏళ్ల చారిత్రక భవనానికి నిప్పు

ఫ్రాన్స్‌లో పెరుగుతున్న జీవన వ్యయానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. ఈ ఆందోళనల్లో భాగంగా 143 ఏళ్ల నాటి చారిత్రక లిమోజెస్ టౌన్ హాల్ భవనానికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో భవనం చాలా వరకు ధ్వంసమైంది.

ఈ భవనానికి 1873లో నిర్మాణం ప్రారంభం కాగా, 1883లో అధికారికంగా ప్రారంభించడం జరిగింది. ఈ భవనం ఫ్రాన్స్‌లో చారిత్రక కట్టడంగా గుర్తింపు పొందింది. ముసుగులు ధరించిన కొందరు ఆందోళనకారులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. మంటల కారణంగా భవనం పైకప్పు పూర్తిగా కూలిపోయిందని, బయటి భాగంలో మూడింట రెండొంతులు నాశనమైందని వెల్లడించారు. ఇది దేశ వారసత్వ సంపదకు జరిగిన ఘోర విపత్తు అని స్థానిక ప్రిఫెక్ట్ మారిస్ బరేట్ ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులు ఉద్దేశపూర్వకంగానే ఈ దాడికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు.

దేశంలో పెరుగుతున్న జీవన వ్యయం, పాఠశాలల్లో పరిస్థితులకు వ్యతిరేకంగా లక్షలాది మంది మొదట శాంతియుతంగా ప్రదర్శనలు చేపట్టారు. అయితే, పారిస్‌తో పాటు మార్సెల్, లియోన్, లిల్లే వంటి నగరాల్లోనూ ఈ నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులు లూటీలకు, దహనకాండలకు పాల్పడ్డారు.

ఈ ఘటనల్లో దేశవ్యాప్తంగా సుమారు 1200 మందిని అదుపులోకి తీసుకున్నామని, 150 మందికి పైగా పోలీసులు గాయపడ్డారని ఫ్రెంచ్ అధికారులు తెలిపారు. ఈ హింసను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తీవ్రంగా ఖండించారు. "మన గణతంత్రంలో హింసకు తావులేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటనపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫ్రాన్స్‌లో నెలకొన్న అశాంతికి వలస విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. "వైవిధ్యం, కరుణ పేరుతో పాశ్చాత్య ఉదారవాదులు మూడో ప్రపంచ దేశాలను ఫ్రాన్స్ వంటి దేశాల్లోకి దిగుమతి చేసుకున్నారు. కానీ, వారిని కలుపుకుపోవడం వంటి ప్రాథమిక ప్రశ్నలను విస్మరించారు" అని వ్యాఖ్యానించారు.

మరిన్ని చారిత్రక కట్టడాలు కాలిపోకముందే ఫ్రాన్స్ ఈ ఆందోళనలను ఆపాలని, అమెరికాలో కాంగ్రెస్ డెమోక్రాట్లు కోరుకుంటున్న భవిష్యత్తు ఇదేనని ఆయన హెచ్చరించారు.

## ప్రజల దృష్టి మళ్లించేందుకే రాష్ట్రపతి పాలన డిమాండ్

- మొదటి పేజీ తరువాయి

వివేకా హత్య కేసులో సీబీఐ ఎంపీ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయడానికి వచ్చినప్పుడు 'గొడ్డలిపార్టీ' వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తుచేశారు. తమపై ఉన్న ఆరోపణలకు సమాధానం చెప్పకుండా, రాష్ట్రపతి పాలన అంటూ కొత్త నాటకానికి తెరతీయడం రాజకీయ కపటత్వమని దుయ్యబట్టారు.గత ఎన్నికల సమయంలో వైసీపీ వ్యవహరించిన తీరును ప్రజలు చూశారని, ఇప్పుడు కూడా అదే తరహాలో వివాదాలు సృష్టించి ఆ నెపాన్ని ప్రభుత్వంపై నెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం ఉద్రిక్తతలు పెంచే ప్రయత్నాలను సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే ముందు, గత ఐదేళ్ల తమ పాలనలో వ్యవహరించిన తీరుపై వైసీపీ ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.రాష్ట్రంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి

ఉందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ప్రతి అభ్యర్థి ఎలాంటి ఆటంకాలు లేకుండా నామినేషన్ వేసేలా, ప్రతి ఓటరు భయం లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైసీపీ రెచ్చగొట్టే ప్రకటనలను నమ్మవద్దని, వాస్తవాలను గమనించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రజాస్వామ్యంపై మీరు నీతులు చెప్పడమా?: జగన్‌కు అచ్చెన్నాయుడు కౌంటర్

ప్రజాస్వామ్యం గురించి నేడు మాట్లాడుతున్న జగన్, వారి హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల అరాచకాలకు ముందుగా సమాధానం చెప్పాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాలపై జరిగిన దాడులను, ప్రజాస్వామ్య ఉల్లంఘనలను గుర్తు చేస్తూ జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

"నేడు ప్రజాస్వామ్యం గురించి, రాజ్యాంగం గురించి మాట్లాడుతున్న జగన్ గారిని నేను ఒకటే సూటిగా ప్రశ్నిస్తున్నాను. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో మీరు, మీ ప్రభుత్వం చేసిన అరాచకాలకు ముందు సమాధానం చెప్పండి. ఆ తర్వాతే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు మీకు ఉంటుంది.

ఆనాడు మాచర్లలో టీడీపీ నేతలు బోండా ఉమ, బుద్దా వెంకన్నల వాహనంపై మీ పార్టీ శ్రేణులు దాడి చేసినప్పుడు మీకు ప్రజాస్వామ్యం గుర్తుకురాలేదా? పుంగనూరులో జనసేన అభ్యర్థి నామినేషన్ పత్రాలు చించివేసినప్పుడు రాజ్యాంగం ఏమైంది? మీ ఐదేళ్ల పాలనలో టీడీపీ, జనసేన అభ్యర్థులను నామినేషన్లు కూడా వేయకుండా అడ్డుకున్నారని వచ్చిన వేలాది ఫిర్యాదులకు మీ దగ్గర సమాధానం ఉందా? వీటన్నిటికీ జవాబు చెప్పకుండా ఈరోజు మీరు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉంది.

ఇప్పుడు ఎన్నికల సంఘం స్వతంత్రత గురించి మాట్లాడుతున్నారు కదా? మరి నాడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఉన్న నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పదవీకాలాన్ని తగ్గిస్తూ ఆర్డినెన్స్ ఎందుకు తీసుకొచ్చారు? ఆ చర్యను హైకోర్టు తప్పుబడుతూ కొట్టివేసిన విషయం మర్చిపోయారా? మీ హయాంలో బెదిరింపులు, బలవంతపు ఉపసంహరణల ద్వారా ఏకగ్రీవాలు చేసుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఏమైందో చెప్పాలి.మీ పార్టీ నాయకుల దాడులు, బెదిరింపులతో మా కార్యకర్తల ప్రాణాలు కాపాడుకోవడమే గగనమైంది. అందుకే, తప్పనిసరి పరిస్థితుల్లో మేము స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాల్సి వచ్చింది. ఈ విషయం మీరు మర్చిపోయినా, ప్రజలు మర్చిపోలేదు.

మిథున్‌రెడ్డి ఘటనతో సహా అన్ని ఎన్నికల హింసాత్మక ఘటనలపై నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని మేము డిమాండ్ చేస్తున్నాం. తప్పు ఎవరు చేసినా చట్టం ముందు అందరూ సమానమే. చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాను" అని స్పష్టం చేశారు.

## ఏపీలో మున్సిపల్ ఎన్నికలు.. ముగిసిన నామినేషన్ల గడువు

- మొదటి పేజీ తరువాయి

షెడ్యూల్ ప్రకారం, (అక్టోబర్ 19) నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 21 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో నిలిచే తుది అభ్యర్థులపై స్పష్టత రానుంది. అక్టోబర్ 28న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

## నామినేషన్ల గడువు ముగుస్తోంది.. వెంటనే ఈసీ జోక్యం చేసుకోవాలి: జగన్

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార తెలుగుదేశం పార్టీ దౌర్జన్యాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ వైసీపీ అధినేత జగన్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠాకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఆయన ఎస్ఈసీ కార్యాలయానికి వెళ్లి ఈ మేరకు ఒక వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు కూడా వేయనివ్వకుండా టీడీపీ నేతలు, కార్యకర్తలు భౌతికంగా అడ్డుకుంటున్నారని జగన్ ఆరోపించారు. కొన్నిచోట్ల రిటర్నింగ్ అధికారులు ఉద్దేశపూర్వకంగానే నామినేషన్ పత్రాలు స్వీకరించడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. ఈ దౌర్జన్యాలకు పాల్పడుతున్న టీడీపీ గూండాలకు పోలీసులే పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారని జగన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేటితో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఈసీ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న రిటర్నింగ్ అధికారులు, పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని జగన్ ఎన్నికల కమిషనర్‌ను కోరారు.

## విదేశీ సంస్థలకు రహస్య సమాచారం.. పోలీసుల అదుపులో ఆర్మీఅధికారి భార్య

ఇంటర్నెట్ డెస్క్: విదేశీ గూఢచర్య సంస్థలకు దేశ రక్షణకు సంబంధించిన సున్నితమైన సమాచారం చేరవేస్తున్నారనే ఆరోపణలతో.. ఆర్మీ అధికారి భార్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దేశ భద్రతపై ప్రత్యక్ష ప్రభావం చూపే సున్నితమైన పత్రాలు, ఫోటోలు, ఎలక్ట్రానిక్ డేటాను రహస్యంగా సేకరించడం, బదిలీ చేయడం వంటి విషయాల్లో విదేశీ ఏజెంట్లకు సహకరిస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం అందినట్లు తెలిపారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం..పరిశోధన సంబంధిత కార్యకలాపాలను ఆర్మీ అధికారి పర్యవేక్షించేవారు. ఆయన భార్యకు కొన్ని నెలల క్రితం.. సోషల్ మీడియాలో పలువురు వ్యక్తులు పరిచయం అయ్యారు. వారు తమను తాము విద్యావేత్తలుగా చెప్పుకొన్నారు. వ్యాసాలను ప్రచురిస్తామని నమ్మించి రక్షణ అంశాలపై వ్యాసాలు రాయించారు. ఎటువంటి అనుమానం రాకుండా ఉండేందుకు మొదట పర్యావరణం, భౌగోళిక రాజకీయాలకు సంబంధించిన అంశాలపై వ్యాసాలు రాయిస్తూ.. క్రమంగా రక్షణ రంగానికి సంబంధించిన విషయాల వైపు మళ్లించారు. ఈ విషయం తెలియని మహిళ వారిని నిజమైన విద్యావేత్తలుగా నమ్మి.. వారి ఉచ్చులో పడిపోయింది. రక్షణ, ఆయుధ వ్యవస్థలపై వ్యాసాలతో పాటు కీలక సైనిక స్థావరాల ఫొటోలు, వీడియోలు వాటిలో పొందుపరిచింది. రక్షణ రంగానికి సంబంధించిన వివరాలను కూడా ఆమె వారికి చేరవేసిందా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

## బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ లక్ష్యంగా కాల్పులు

- మొదటి పేజీ తరువాయి

తుపాకీతో వరుసగా కాల్పులు జరిపారు. టైగర్ ష్రాఫ్ సురక్షితంగా బయటపడ్డారు. కారు డ్రైవర్‌తోపాటు ఓ ఆటో డ్రైవర్‌కు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై జుహు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.ఈ ఘటనకు బాధ్యులు ఎవరు? ఎందుకు చేశారు? అన్న వివరాలు తెలియాల్సి ఉంది. అయితే.. ఈ కాల్పులకు తామే బాధ్యులమని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన అనిల్ పండిత్, హర్మన్ సంధు అనే గ్యాంగ్‌స్టర్ల పేరిట సోషల్ మీడియాలో పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. సల్మాన్ ఖాన్‌తో కలిసి పనిచేసే విషయంలో తమ గ్యాంగ్ హెచ్చరికలను పట్టించుకోనందుకే టైగర్ ష్రాఫ్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు వారు పేర్కొన్నారని జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ముంబయి పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేసి కాల్పుల ఘటనపై వివరాలు ఆరా తీశారు. ఈ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీని ఆదేశించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. మరోవైపు.. నిందితుల కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ ఘటనను వివిధ కోణాల్లో దర్యాప్తు చేసేందుకు 15 బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## 17వ వార్డులో కూటమి అభ్యర్థి బుడుమూరి గోవింద్ పాదయాత్ర



**విశాఖపట్నం:** జీవీఎంసీ 17వ వార్డు కూటమి కార్పొరేటర్ అభ్యర్థి బుడుమూరి గోవింద్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల ప్రచార పాదయాత్ర ప్రచారంలో భాగంగా పెదగదిలి శివాలయం వీధి నుండి ప్రారంభమయ్యే ఈ పాదయాత్ర బూత్ నెంబర్లు 48, 52, 53, 57 పరిధిలోని సాలిపేట, ఈశ్వరదేవి నగర్, బలమురళి సేవా సంఘం, సాయి బాబా టెంపుల్ వద్ద గల మీ-సేవ వరకు సాగనుంది. ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు,మహిళలు, అభిమానులు పాల్గొననున్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం। అనకాపల్లి। అల్లూరి జిల్లా

# జీకే.వీధి వైసీపీ జెడ్పీటీసీ టికెట్‌పై ఉత్కంఠ!



### కష్టపడ్డ కార్యకర్తలకు దక్కేనా ప్రాధాన్యం.. రిటైర్డ్ ఉద్యోగుల పేర్లపై చర్చ!

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 18**:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి ఎంపికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన స్థానిక నాయకులు, కార్యకర్తలకు అవకాశం దక్కుతుందా? లేక ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రిటైర్డ్ ఉద్యోగుల పేర్లు పరిశీలనలోకి వస్తాయా? అన్న అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అయితే అభ్యర్థి ఎంపికపై పార్టీ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

**కార్యకర్తల సేవలకు గుర్తింపు దక్కేనా?:**
పార్టీ కష్టకాలంలోనూ జెండా మోసి, కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్న అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జెడ్పీటీసీ టికెట్ కోసం పలువురు ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఇదే సమయంలో, ఆర్థికంగా ఖర్చు చేయగల సామర్థ్యం ఉన్న రిటైర్డ్ ఉద్యోగులకు అవకాశం కల్పించవచ్చన్న ఊహాగానాలు కూడా తెరపైకి వస్తున్నాయి. ఈ ప్రచారంలో వాస్తవమెంత? అభ్యర్థి ఎంపికలో పార్టీ అధిష్ఠానం ఎలాంటి ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుంటుందన్నది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

**జగన్ హామీ నేపథ్యంలో పెరిగిన ఆశలు:**
పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామని చేసిన ప్రకటనల నేపథ్యంలో స్థానిక పార్టీ శ్రేణుల్లో ఆశలు పెరిగాయి. ఈ క్రమంలో గూడెంకొత్తవీధి మండలంలో జెడ్పీటీసీ అభ్యర్థి ఎంపిక సందర్భంగా పార్టీ కోసం పనిచేసిన వారి సేవలకు గుర్తింపు లభిస్తుందా? అన్న ప్రశ్న చర్చకు వస్తోంది.

**2024 ఎన్నికల ఫలితాల నుంచి గుణపాఠం నేర్చుకుంటుందా?:**
2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఎదుర్కొన్న పరాజయం నేపథ్యంలో పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యకర్తలకు ప్రాధాన్యం వంటి అంశాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. స్థానిక నాయకత్వం కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థిని ఎంపిక చేయాలన్న వాదన వినిపిస్తోంది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని స్థానిక పరిస్థితులు, ప్రజల్లో అభ్యర్థికి ఉన్న ఆదరణ, పార్టీ కోసం చేసిన సేవలు వంటి అంశాలు కీలకంగా మారే అవకాశముంది.

**అధిష్ఠానం నిర్ణయంపై ఆసక్తి:**
గూడెంకొత్తవీధి మండలంలో వైసీపీ జెడ్పీటీసీ టికెట్ ఎవరికి దక్కుతుందన్న అంశంపై పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. స్థానికంగా పనిచేసిన కార్యకర్తకు అవకాశం కల్పిస్తారా? ఇతర ప్రాంతాలకు చెందిన ఆశావహుల పేర్లను పరిశీలిస్తారా? అన్నది వేచి చూడాల్సిందే. ప్రస్తుతం వినిపిస్తున్న పేర్లు, ప్రచారంపై అధికారిక ధృవీకరణ లేనందున అభ్యర్థి ఎంపికపై స్పష్టత రావాలంటే పార్టీ అధిష్ఠానం ప్రకటన వరకు వేచి ఉండాల్సి ఉంది.

## పచ్చిమేత సాగు క్షేత్రాలను పరిశీలించిన పశు వైద్యాధికారులు



- ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోనుటకు రైతులకు అవగాహన.
- పశువైద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లావేటి ప్రదీప్ కుమార్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 18.**మండలంలో గల జోలపుట్టు పంచాయతీ, లబ్బూరు గ్రామానికి చెందిన రైతు సీసా పూర్ణ చేపట్టిన బహువార్షిక పచ్చిమేత సాగు క్షేత్రాలను సందర్శించి, సాగు పురోగతిని పరిశీలించినట్లు పశు వైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లావేటి ప్రదీప్ కుమార్ తెలిపారు. ప్రదీప్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లబ్బూరులో రైతు సీసా పూర్ణ చేపట్టిన బహువార్షిక పచ్చిమేత సాగు పట్ల ఆయనను వైద్యాధికారి అభినందించి ప్రోత్సహించారు. మేకలు, గొర్రెలకు నాణ్యమైన పచ్చిమేతను అందించడం ద్వారా వాటి ఆరోగ్యకరమైన పెరుగుదలకు, మంచి శరీర బరువు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పశువులకు నాణ్యమైన మేతను అందుబాటులో ఉంచడం ఎంతో అవసరమని, అదేవిధంగా కొండ ప్రాంతాల్లో స్థానికంగా పచ్చిమేత అందుబాటులో ఉండటం వల్ల పశువులను మేత కోసం దూర ప్రాంతాలకు తీసుకెళ్లే అవసరం తగ్గి, ప్రమాదాలను నివారించడంతో పాటు, ప్లాస్టిక్ వ్యర్థాలను తినడం వల్ల కలిగే సమస్యలను తగ్గించవచ్చన్నారు. అదేవిధంగా రాబోయే ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవడంలో, పశు గ్రాస కొరతను తగ్గించడంలో ఇటువంటి బహువార్షిక పచ్చిమేత సాగు విధానాలు కీలక పాత్ర పోషిస్తాయనీ, గిరిజన ప్రాంతాల్లో పశుసంపద సంరక్షణకు, పశుపోషకుల జీవనోపాధి బలోపేతానికి ఇవి దోహదపడతాయన్నారు. రైతులు పశుగ్రాస అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని, వాటి ద్వారా అందించే ప్రయోజనాలను పొందాలనీ, బహువార్షిక పచ్చిమేత సాగును విస్తరించి, పశువులకు నాణ్యమైన మేతను అందుబాటులో ఉంచుకోవాలనీ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య శాఖ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ జ్యోతి స్వరూప, వరలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మంగళ కాళీ పీఠంలో వైభవంగా శ్రీ షోడశీదేవి అమ్మవారి హోమం,

- శ్రీ పరమేశ్వర నందగిరి స్వామీజీ వారి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు
- దివ్య ఆధ్యాత్మిక వాతావరణంలో అమ్మవారి హోమం
- భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి



**విశాఖ, పెన్ పవర్, అక్టోబర్ 18 :**శ్రీ మంగళ కాళీ పీఠంలో ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీ షోడ శీదేవి అమ్మవారి అర్చన, హోమం,విశేష పూజా కార్ క్రమాలు అత్యంత వైభవంగా,భక్తి శ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. శ్రీ పరమేశ్వర నందగిరి స్వామీజీ వారి ఆధ్వర్యం లో,పరమ గురువులు మహా అవతార్ బాబాజీ వారి దివ్య ఆ శీస్సులతో ఈ పవిత్ర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వేదమంత్రాల నడుమ హోమ కార్యక్రమాలు, అమ్మవారికి విశేష అర్చన లు, ప్రత్యేక పూజలు భక్తిపారవశ్యం తో నిర్వహించారు. హోమాగ్ని పవి త్రత,మంత్రోచ్చారణల నడుమ శ్రీ మంగళ కాళీ పీఠం ప్రాంగణం ఆ ధ్యాత్మిక శోభను సంత రించుకుంది. అమ్మవారి దివ్య అనుగ్రహం,గురు వుల ఆశీస్సులు సమస్త ప్రజలకు శాంతి, సౌభా గ్యం,సుఖసంతోషాలు ప్రసాదించాలని భక్తులు ప్రార్థించా రు.శ్రీ పర మేశ్వరానంద గిరి స్వామీజీ వారి మార్గదర్శక త్వంలో నిర్వహించిన ఈ పూ జా కార్యక్రమా లు భక్తులలో భక్తిభావాన్ని, ఆ ధ్యాత్మిక చైతన్యాన్ని మరింత పెంపొందించా యి. పరమ గురుదేవులు మహా అవతార్ బాబా జీ వారి దివ్య కృపాక టాక్షాలతో లోకక ల్యాణం, ధర్మ పరిరక్షణ,సర్వ జన శ్రేయస్సు కలగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. భక్తి,ఆధ్యాత్మికత,దైవానుగ్రహాల సమ్మే ళనంగా శ్రీ షోడశీ దేవి అమ్మవారి అర్చన, హోమం, కార్యక్రమాలు వైభవంగా ముగిశాయి.

## 16వ వార్డులో టికెట్ ఉత్కంఠ - ఫ్రెండ్లీ పోటీపై ప్రజల్లో చర్చ




### బీ-ఫారం పై స్పష్టత కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు, శ్రేణులు

**విశాఖ తూర్పు, పెన్ పవర్, అక్టోబర్ 18**: జీవీఎంసీ ఎన్నికల్లో భాగంగా 16వ వార్డు ప్రస్తుతం వార్డు రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. కూటమి పొత్తులపై ఇంకా స్పష్టత రాకపోవడంతో ఈ వార్డులో ఫ్రెండ్లీ పోటీ నెలకొందని ప్రజలు, స్థానిక నాయకులు చర్చించుకుంటున్నారు.

**నామినేషన్ వేసిన ప్రధాన అభ్యర్థులు:**
- టీడీపీ నుంచి: ఏడువాక శ్రీమహాలక్ష్మి సన్యాసిరావు, కెల్లా సునీత, ఈశ్వరమ్మ, మజ్జి రమణి
- జనసేన నుంచి: డాక్టర్ పావని
- వైఎస్ఆర్సీపీ నుంచి: సత్యాల సాగరిక, ప్రసంగి సత్యవతి, వనము వరలక్ష్మి
- బీజేపీ నుంచి: వరలక్ష్మి
- సీపీఐ(ఎం) నుంచి:) శిరెడ్డి రంగమ్మ

వీరితో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలు చేశారు.

**ప్రస్తుతం ప్రజల్లో జరుగుతున్న చర్చ:**
అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం: ఒకే వార్డు నుంచి ఇంత మంది నామినేషన్లు వేయడంపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. దీంతో పోటీ తీవ్రంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. .లిఅధిష్టానం నిర్ణయం కోసం ఎదురుచూపు: కూటమిలో సీటు ఎవరికి దక్కుతుందనే దానిపై పార్టీల అధిష్టానం ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. దీంతో బీ-ఫారం ఎవరికి ఇస్తారనే ఉత్కంఠ అభ్యర్థుల్లో, కార్యకర్తల్లో నెలకొంది. పార్టీ పెద్దలు అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని శ్రేణులు కోరుకుంటున్నాయి. 18,600 ఓటర్లు ఉన్న అతిపెద్ద వార్డు: 16వ వార్డు 18,600 పైగా ఓటర్లతో అతిపెద్ద వార్డు కావడం వల్ల ఇక్కడ గెలుపు అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది.ప్రజల ఆకాంక్ష: ఎవరు గెలిచినా వార్డులోని మౌలిక సమస్యలు, రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించే నాయకుడు కావాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. అధికారిక బీ-ఫారం ప్రకటన తర్వాత ఈ గందరగోళానికి తెరపడుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## 100శాతం గిరిజనులు నివసించే ప్రాంతంలో అన్ రిజర్వ్డ్ ఎలా?

- 5వ షెడ్యూల్ ఏరియాలో పెసా చట్టం ఉల్లంఘన!
- 17అన్‌రిజర్వ్‌డ్ ఎంపిటిసి స్థానాలను పునః పరిశీలించాలి.
- కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ రాష్ట్ర వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 18.** అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు మండలంలోని రంగబయలు ఎంపిటిసి సెగ్మెంట్ లో 100శాతం గిరిజనులు నివసిస్తున్నప్పటికీ అన్‌రిజర్వ్‌డ్ క్రింద ఎంపీటీసీ స్థానాన్ని కేటాయించడం పట్ల కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ రాష్ట్ర వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం తీవ్రంగా ఖండించారు. ఆదివారం రంగబాయలు, వనుగుమ్మ, లంగ్భ పొదోర్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ముంచంగిపుట్టు మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నీలకంఠం మాట్లాడుతూ.. 100 శాతం పివిటిజీ గిరిజనులు నివసించే ఈ ప్రాంతంలో ఏవిధంగా అన్‌రిజర్వ్‌డ్ ఎంపిటిసి స్థానంగా చూపిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రంగబయలు సెగ్మెంట్ ప్రజలు ఈదులు గడ్డి, ప్లాస్టిక్ కవర్లు, తాటాకుల నీడన దుర్భర జీవితం గడుపుతుండటంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ?దశాబ్దాలు గడిచినా గిరిజనులకు కనీస గృహ వసతి కల్పించకపోవడం శోచనీయమన్నారు. అదేవిధంగా 5వ షెడ్యూల్, పెసా చట్టాలను ఉల్లంఘిస్తూ జిల్లాలో ప్రకటించిన 17 అన్‌రిజర్వ్‌డ్ ఎంపిటిసి స్థానాలను ప్రభుత్వం తక్షణమే పునఃపరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు. ?రంగబయలు వంటి పివిటిజీ గ్రామాలకు పక్కా ఇళ్లు, రోడ్లు, తాగునీరు కల్పించాలని, లేకపోతే రాజ్యాంగబద్ధంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేష్, బాలక్రిష్ణ, సంజయ్, హరిబాబు, రాంబాబు, సంతోష్, మంగ్ల, మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## 15 వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తా టిడిపి అభ్యర్థి ఒమ్మి అప్పలరాజు



**విశాఖ తూర్పు,పెన్ పవర్,అక్టోబర్ 18:** వార్డ్ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తనకు ముఖ్యమని, రానున్న రోజుల్లో ప్రజల సహకరించి కౌన్సిల్ కి తనను పంపించాలని కోరారు జీవీఎంసీ స్థానిక ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా ఆయన శ్రీ టిఐసి పాయింట్ క్రాంతి నగర్ ప్రాంతాలలో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ప్రచారంలో వార్డు మంచి కార్పొరేటర్ ఎన్ని సన్యాసిరావు వార్డు. నాయకులు గాడి సత్యం మహిళలు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారు!

- ఈ నెల 21 నుంచి నామినేషన్ల స్వీకరణ.. నవంబర్ 3న పోలింగ్
- అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటించాలి: ఎంపీడీవో బి.హెచ్.వి. రమణబాబు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 18:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ నుంచి ఓట్ల లెక్కింపు వరకు షెడ్యూల్ వివరాలను గూడెంకొత్తవీధి ఎంపీడీవో బి.హెచ్.వి. రమణబాబు ఒక ప్రకటనలో వివరించారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు నామినేషన్ ప్రక్రియ, ఫీజులు, అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అక్టోబర్ 21 నుంచి 23వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అక్టోబర్ 24న నామినేషన్ల పరిశీలన, 25న తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్ల దాఖలు, 26న అప్పీళ్లపై నిర్ణయం తీసుకుంటారు. అక్టోబర్ 27న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియతో పాటు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించి, ఎన్నికల గుర్తులను కేటాయిస్తారు.నవంబర్ 3న పోలింగ్ నిర్వహించనుండగా, నవంబర్ 4న అవసరమైన చోట రీపోలింగ్ నిర్వహిస్తారు. నవంబర్ 5న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు.

**నామినేషన్ ఫీజుల వివరాలు:**

పంచాయతీ వార్డు సభ్యుల అభ్యర్థులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి రూ.500, ఇతరులకు రూ.1,000 నామినేషన్ ఫీజుగా నిర్ణయించారు. సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థులకు ఎస్సీ, ఎస్టీ,బీసీలకు రూ.1,500, ఇతరులకు రూ.3,000; జడ్పీటీసీ అభ్యర్థులకు ఎస్సీ, ఎస్టీ,బీసీలకు రూ.3,000, ఇతరులకు రూ.6,000గా పేర్కొన్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన రిజర్వుడు కేటగిరీ అభ్యర్థులు రాయితీ పొందేందుకు నామినేషన్ దాఖలు సమయంలో సంబంధిత కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు.ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు నిర్ణీత గడువులోగా నామినేషన్లు దాఖలు చేసి, అవసరమైన పత్రాలను సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

## 73వ వార్డు అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా..
- ప్రజలు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..
- టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి పెప్సీ రమణ వెల్లడి
- చంద్రబాబు, గణబాబు ఆశీస్సులతో ఎన్నికల బరిలోకి..



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 18:** జీవీఎంసీ 73వ వార్డు అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా పెప్సీ రమణ ఎన్నికల బరిలోకి దిగారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులు, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు ప్రోత్సాహంతో ప్రజాసేవకు ముందుకు వస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు శనివారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం తన లక్ష్యాలను మీడియాతో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 73వ వార్డు పరిధిలోని ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పెప్సీ రమణ స్పష్టం చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రాధాన్యతనిస్తానన్నారు. రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. వార్డులో ఏ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నాయో గుర్తించి, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. అవసరమైన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, దశలవారీగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా తన వంతు సహకారం అందిస్తానని పెప్సీ రమణ తెలిపారు. పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, అర్హులు వాటి ప్రయోజనాలను పొందేందుకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తానన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు. కార్పొరేటర్ పదవిని అధికారంగా కాకుండా బాధ్యతగా భావించి, వార్డు ప్రజలతో మమేకమై పనిచేస్తానని పెప్సీ రమణ పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యతనిస్తూ, వార్డులోని అన్ని ప్రాంతాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందిస్తానని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఆశీస్సులు, ఎమ్మెల్యే గణబాబు ప్రోత్సాహం, పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారం తనకు ఎంతో బలాన్నిస్తున్నాయని పెప్సీ రమణ వెల్లడించారు. ప్రజల మద్దతుతో 73వ వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన సంకల్పమని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ వార్డు అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

# 73వ వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దొడ్డి కిరణ్ నామినేషన్





- 100 బైక్‌లతో కార్యకర్తలు, నాయకుల నడుమ ఉత్సాహంతో భారీ ర్యాలీ
- వార్డు ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం
- దశాబ్దాలుగా ప్రజలతో మమేకమై సేవలందిస్తున్నా
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దొడ్డి కిరణ్

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 18 :** గ్రేటర్ విశాఖపట్నం మహా నగరపాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలోని 73వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దొడ్డి కిరణ్ తన నామినేషన్‌ను సోమవారం ఉదయం ఉత్సాహభరిత వాతావరణంలో దాఖలు చేశారు. సుమారు 100 ద్విచక్ర వాహనాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా బయలుదేరి వెస్ట్ జోన్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారులకు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంది. ద్విచక్ర వాహనాల ర్యాలీతో పార్టీ శ్రేణుల్లో ఎన్నికల ఉత్సాహం కనిపించింది. అభ్యర్థి దొడ్డి కిరణ్‌కు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా దొడ్డి కిరణ్ మాట్లాడుతూ.. దశాబ్దాల కాలంగా 73వ వార్డు ప్రజలతో మమేకమై ఉంటూ, వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటూ వస్తున్నానని తెలిపారు. ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను గుర్తించి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా సేవలందిస్తానని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి ఆకాంక్షలకు అనుగుణంగా వార్డు అభివృద్ధికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. ప్రజలతో తనకున్న అనుబంధం, వారి సమస్యలపై తనకున్న అవగాహన వార్డు అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దొడ్డి కిరణ్ నామినేషన్ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 100 బైక్‌లతో నిర్వహించిన ర్యాలీ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. నామినేషన్ దాఖలుతో 73వ వార్డులో ఎన్నికల సందడి మరింత పెరిగింది. ప్రజల సమస్యల పరిష్కారం, వార్డు అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతానని దొడ్డి కిరణ్ ప్రకటించడంతో నామినేషన్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

## జడ్పీటీసీ టికెట్ మాదే.. స్థానికులకే కేటాయించాలి!

- పార్టీ కోసం పనిచేసిన స్థానిక నాయకులకే ప్రాధాన్యం ఇవ్వాలి..
- కూటమి పెద్దలకు మండల అధ్యక్షుల విజ్ఞప్తి..



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్,అక్టోబర్ 18:**అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యంత వెనుకబడిన గిరిజన మండలాల్లో ఒకటైన గూడెంకొత్తవీధి మండల జడ్పీటీసీ (గ్రూజ) టికెట్‌ను స్థానిక నాయకులకే కేటాయించాలని టీడీపీ, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు పొత్తూరు కొండలరావు, కొయ్యం బాలరాజు, కాకురు శేఖర్ కూటమి పెద్దలకు విజ్ఞప్తి చేశారు. మండలంలో పార్టీ బలోపేతానికి, కార్యకర్తల అభివృద్ధికి క్షేత్రస్థాయిలో నిరంతరం కృషి చేసిన స్థానిక నాయకులకు అవకాశం కల్పించాలని కోరారు.గత ఎన్నికల నుంచి పార్టీ కష్టకాలంలోనూ జెండాను భుజాన వేసుకుని ప్రతి గ్రామంలో, ప్రతి గడపలో పార్టీ కోసం పనిచేసింది స్థానిక నాయకులు, కార్యకర్తలేనని వారు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో కూటమి శ్రేణులను సమన్వయం చేస్తూ, కార్యకర్తలకు అండగా నిలుస్తూ పార్టీని బలోపేతం చేయడంలో స్థానిక నాయకులు కీలక పాత్ర పోషించారని తెలిపారు.ఇలాంటి పరిస్థితుల్లో జడ్పీటీసీ వంటి కీలక పదవికి స్థానికేతరులకు టికెట్ కేటాయిస్తే, పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న స్థానిక నాయకులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మండలంలోని గిరిజన గ్రామాల సమస్యలు, ప్రజల ఇబ్బందులు, ప్రతి పంచాయతీ అవసరాలపై ప్రత్యక్ష అవగాహన ఉన్న స్థానిక నాయకులకే ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలు ఉంటాయని వివరించారు.కూటమి విజయానికి స్థానిక నాయకత్వం కీలకమని, అభ్యర్థి ఎంపికలో స్థానిక పరిస్థితులు, ప్రజలతో సంబంధాలు, పార్టీ కోసం చేసిన సేవలను పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరారు. మండలంలో పుట్టి పెరిగి, ఇక్కడి ప్రజల సమస్యలపై అవగాహన కలిగి, పార్టీ కోసం నిరంతరం పనిచేసిన నాయకుడికే జడ్పీటీసీ టికెట్ కేటాయించేలా కూటమి అగ్రనాయకత్వం సానుకూలంగా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

**స్థానికుల హక్కుకు ప్రాధాన్యం ఇవ్వాలి:**

గూడెంకొత్తవీధి మండల అభివృద్ధి, గిరిజన ప్రజల సమస్యల పరిష్కారం, కూటమి బలోపేతం లక్ష్యంగా స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని మండల అధ్యక్షులు స్పష్టం చేశారు. జడ్పీటీసీ అభ్యర్థి ఎంపిక విషయంలో స్థానిక నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, మండలానికి చెందిన అర్హులైన నాయకులకు అవకాశం కల్పించాలని కోరారు.“మా మండలం -- మా టికెట్.. జీకే వీధి జడ్పీటీసీ టికెట్ స్థానికులకే కేటాయించాలి” అన్నది తమ ప్రధాన డిమాండ్ అని టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, జనసేన మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు కాకురు శేఖర్ పేర్కొన్నారు.

## ప్రజలలో నాకున్న ఆదరణను చూసి ఓర్వలేని వ్యక్తుల నుంచి దూరంగా ఉన్నాను.

- ప్రజా సంఘాలను నేనెప్పుడూ గౌరవిస్తాను ఆదివాసి హక్కుల రక్షణకై నా పాత్ర ఎప్పటికీ ఉంటుంది.
- బహిష్కరణపై ఘాటుగా స్పందించిన డి.ఎల్.ఓ తాజా మాజీ సభ్యురాలు కవడం కాసులమ్మ.



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 18.**తనపై డి.ఎల్.ఓ రాష్ట్ర కమిటీ విధించిన బహిష్కరణపై డి.ఎల్.ఓ తాజా మాజీ సభ్యురాలు కవడం కాసులమ్మ ఘాటుగా స్పందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డి.ఎల్.ఓ దండకారణ్య ఎమోషనల్ సమితి సిద్ధాంతాలను, విధివిధానాలను తాను ఎప్పుడూ గౌరవిస్తూనే ఉంటానని తెలిపారు. తాను ఎక్కడున్నా ప్రాంత రక్షణ కోసం, ఆదివాసీ హక్కుల కోసం ఉద్యమిస్తానని ఆమె స్పష్టం చేశారు.ప్రజలలో తనకు ఉన్న ఆదరణను చూసి ఓర్వలేని కొంతమంది స్వార్థపరుల నుంచి తాను దూరంగా ఉన్నానని ఆమె తెలియజేశారు. డి.ఎల్.ఓ నుండి బహిష్కరణ అంటూ వస్తున్న వాల్ పోస్ట్ ప్రచారంపై స్పందిస్తూ, తాను స్వచ్ఛందంగా, తన ఇష్ట ప్రకారమే డి.ఎల్.ఓ సంఘానికి దూరంగా ఉన్నానని వెల్లడించారు.ప్రజా సంఘాల్లో ఉంటూనే రాజకీయ పార్టీల్లో పని చేస్తూ ప్రాంత అభివృద్ధి కొరకు, అడవి హక్కుల రక్షణ కొరకు తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. కొందరు స్వార్థపరులు చేస్తున్న ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాను ఎప్పుడూ ప్రజల మనిషినేనని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా కవడం కాసులమ్మ అండగా ఉంటుందని ఆమె అన్నారు.

# ఉత్సాహంగా బైపిల్లి గాంధీ నామినేషన్



**గాజువాక పెన్ పవర్ అక్టోబర్ 18.:-**జీవీఎంసీ 91 వ వార్డులో ఎన్నికల కోలాహలశీ మొదలైంది. ఇక్కడ స్థానికశీగా నివాసం ఉంటున్న టిడిపి వార్డు సీనియర్ నాయకుడు బైపిల్లి గాంధీ తన కుటుంబ సభ్యులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. వార్డులోని వికాస్ నగర్ కూడలిలో గల వినాయక, శివాలయాలలో తొలుత పూజలు నిర్వహించి అనంతరం అధిక సంఖ్యలో తరలివచ్చిన టిడిపి శ్రేణులు కార్యకర్తలు అభిమానులతో ఆయన ర్యాలీగా బయలుదేరారు.అంతకు ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కార్యకర్తగా ఉంటూ పార్టీ అభివృద్ధి కార్యక్రమాల్లో తన వంతు పాత్ర పోషించానని,ఈ ఎన్నికల్లో తాను గెలిస్తే వార్డును ప్రగతి పదం దిశగా ముందుకు తీసుకువెళ్తానని చెప్పారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అంటే తనకు ఎనలేని అభిమానం అని ఆయన ఆలోచనలు ఆయన సూచనలు ఆయన ఆదేశాలను పాటిస్తూ పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నట్టు తెలిపారు.ఎన్నికల్లో తాను గెలిస్తే ప్రజలు అనుకున్న అభివృద్ధి సంక్షేమాన్ని చేసి చూపిస్తానని అన్నారు.భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులకు, మహిళలకు బైపిల్లి గాంధీ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి వెళ్లి గాజువాక జోనల్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు.కార్యక్రమంలోజీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబెర్ కారి గోవింద రాజు, జనసేన నాయకులు బాబు రావు, అల్లు సాయిరాం, శిరసపల్లి శ్రీనివాస్ రావు, స్వరూప రాణి, సమ్మిడి ఉమ, ప్రభావతి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

# పాడేరు లో మహిళా మెగా వాలీబాల్ టోర్నమెంట్ క్రీడలు శారీరక ఉత్తేజం

**తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు**



**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 18:**పాడేరు సినిమ హాల్ సెంటర్ లో ఏర్పాటు చేసినా శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ దసరా నవరాత్రుల పండగ పురస్కరించుకొని పాడేరులో జూనియర్ కాలేజ్ గ్రౌండ్ లోమహిళా మెగా వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలను ఆదివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మహిళా క్రీడా కారిణిలను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక ఉత్తేజన్నీ నింపుతుందని అన్నారు. విద్యార్ధి దశ నుండి క్రీడల పట్ల అవగాహన కలిగి చక్కటి నైపుణ్యాని ప్రదర్శిస్తూ ముందుకు సాగాలని అన్నారు. ఈ

వాలీబాల్ పోటీల్లో మొదటి బహుమతి రూ 15000, రెండో బహుమతిరూ 10000, మూడో బహుమతిరూ 8000, నాలుగో బహుమతిరూ 5000 చొప్పున తనతో పాటు, దసరా కమిటీ అధ్యక్షులు నాగు, దుర్గాదేవి గుడి గౌరవ అధ్యక్షులు రొబ్బి రాము ఆటో యూనియన్ నాయకులు ఇచ్చేందుకు సిద్ధం చేశారని అన్నారు. రాష్ట్ర స్థాయి మహిళల వాలీబాల్ పోటీల్లో తెలుగు రాష్ట్రలైనా తెలంగాణ సిద్దిపేట టీం, విశాఖపట్నం, గోపాలపట్నం, అమరావతి, అల్లూరి జిల్లా, తిరుపతి, విజయనగరం అకాడమీ టీంలు సుమారుగా 10 టీములు పాల్గొన్నారనీ అన్నారు.ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా మహిళలు వాలీబాల్ కోచ్ మహేష్, పిసా కమిటీ సెక్రటరీ సింహాచలం, స్పోర్ట్స్ సెక్రటరీ సోమిలి సింహాచలం, వనవాసి కళ్యాణం సభ్యులు, డి ఎస్ డి వో స్పోర్ట్స్ డిపార్ట్మెంట్, రాష్ట్రం నుంచి వచ్చినటువంటి క్రీడాకారులు మరియు పాడేరు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మస్జిదే అల్ నిమ్రా జీ మాడుగుల మస్జిద్ లో ఘనంగా జరిగిన ఖురాన్ ప్రసంగం.

**జి.మాడుగుల.పెన్ పవర్.అక్టోబర్ (18)**జి మాడుగుల మండల కేంద్రంలో గల మస్జిదే అల్ నిమ్రా జమియ్యత్ ఆహ్లే హదీస్ లో. ముస్లిం సోదరుల ఆధ్యాత్మిక కార్యక్రమమైన ఇస్తిమా (బయాన్) "ఖురాన్" ప్రసంగం, మస్జిదే నిమ్రా కమిటీ అధ్యక్షులు సుల్తాన్ .సుబేర్. ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర జమాయియ్యత్ అహలే హదీస్ సంస్కరణ విభాగం ఆంధ్రప్రదేశ్ ప్రసంగికులు జనాబ్ అబ్దుల్ రహమాన్, జనాబ్ రహమతుల్లా, షేక్ జిలాని, అబ్దుల్ కపూర్, ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ, సమస్త మానవాళికి ఆరాధ్యుడు, పూజ్యుడు ,ఒకే ఒక్కడు అల్లాయే అని, భూమిలో ఉన్న సమస్త వస్తువులు సృష్టించినవాడు, తగు రీతిలో సప్త ఆకాశాలను నిర్మించినవాడు, ఆయనే అని, మరియు ఖురాన్ విశిష్టత, హదీసు వాక్యాలను, ఇస్తిమాకు విచ్చేసిన ముస్లిం సోదరులకు తెలియజేసేసారు. ఈ కార్యక్రమానికి మండల కేంద్రంలో వివిధ ప్రాంతాల లోగల ముస్లిం సోదర, సోదరీమణులు. చింతపల్లి. పాడేరు మండలాలు నుండి కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు, అనంతరం మసీదు ప్రాంగణంలో కమిటీ వారి ఏర్పాటు చేసిన విందు భోజనంలో



పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు, మీరన్ ..యాకూబ్, ఇర్ఫాన్, షుబేర్ ,అమీన్, పెదరహమాన్, , ఇస్మాయిల్, అబ్బాస్, రఫీ, తజ్వీర్, కుధాన్, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## లోవ తలుపులమ్మ ఆలయంలో దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

**శరణుఘోషతో మార్మోగిన ఆలయ ప్రాంగణం.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు**



**పెన్ పవర్ బ్యూరో కాకినాడ (లోవ)** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు లోవ గ్రామంలో కొలువైన శ్రీ తలుపులమ్మ అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తలుపులమ్మ దీక్ష, భవానీ దీక్ష మాలధారణ చేసిన భక్తుల శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా శ్రీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాదేవి శాశ్వత శక్తి స్వరూపిణిగా, ధర్మాన్ని నిలబెట్టి అధర్మాన్ని సంహరించే దివ్యమాతగా భక్తులచే పూజలందుకుంటారు. స్వార్థం, అసూయ, ద్వేషం, కోపం, అహంకారం వంటి దుష్ప్రవృత్తులను తొలగించి, మానవాళిని చెడు నుంచి రక్షించే జగన్మాతగా ఆమెను ఆరాధిస్తారు. అనంతమైన కరుణ, అపారమైన శక్తికి ప్రతీకగా నిలిచే దుర్గాదేవి, లోకంలో అధర్మం పెరిగినప్పుడు దుష్టశక్తులను సంహరించి ధర్మాన్ని కాపాడే శక్తిగా పురాణాలు కీర్తిస్తున్నాయి.

మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి వంటి అనేక రూపాల్లో పూజలందుకునే అమ్మవారు సృష్టి, స్థితి, పరివర్తనలకు ప్రతీకగా నిలుస్తారు. మహిషాసురుడిని సంహరించినందుకు మహిషాసురమర్దినిగా కీర్తించబడుతున్నారు. దుర్గాదేవిని ఆరాధించడం ద్వారా భక్తులకు ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం, సంకల్పశుద్ధి కలుగుతాయని, ధర్మమార్గంలో నడిచే ధైర్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం.

శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని రోజుకో ప్రత్యేక అలంకారంలో దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. తొమ్మిదవ రోజు అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందుకు ఆలయ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు.

## శాంతిభద్రతలు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



అడిషనల్ ఎస్పీ శృతి, డీఎస్పీ రాజసింహారెడ్డి.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 18.**రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముంచంగిపుట్టు మండలంలో పోలీస్ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ముంచంగిపుట్టులోని బాలుర పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని అడిషనల్ ఎస్పీ వై. శృతి, డీఎస్పీ వి. రాజసింహారెడ్డి పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లు, మౌలిక వసతులను వారు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ, ఇతర అధికారులతో కలిసి ఎన్నికల నిర్వహణ మరియు భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఎన్నికలను పూర్తిగా ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరు పాల్పడినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలని కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని వారు పిలుపునిచ్చారు.

## రావులపాలెం మండలంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించిన పోలీసు అధికారులు



**రావులపాలెం పెన్ పవర్ అక్టోబర్ 19:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఆదేశాలతో కొత్తపేట సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సుంకర మురళి మోహన్, రావులపాలెం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. రమేష్ బాబు కలిసి రావులపాలెం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అవసరమైన వివరాలను తెలుసుకున్నారు. పోలీసు అధికారులు చేపట్టిన ఈ పర్యటనలో భాగంగా పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులను పరిశీలించి, ఎన్నికల ప్రక్రియకు సంబంధించి క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరించారు. రావులపాలెం మండలంలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను సందర్శించడం ద్వారా ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులపై అధికారులు అవగాహన పొందారు. పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో కొత్తపేట సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సుంకర మురళి మోహన్, రావులపాలెం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. రమేష్ బాబు పాల్గొన్నారు.

గమనిక: మీరు అందించిన వివరాల ఆధారంగా ఈ వార్త రూపొందించబడింది. పరిశీలనలో తీసుకున్న నిర్దిష్ట నిర్ణయాలు లేదా అదనపు భద్రతా చర్యల వివరాలు అందుబాటులో లేనందున వాటిని చేర్చలేదు.

## ఏలేశ్వరం మున్సిపాలిటీ చైర్ పర్సన్ అభ్యర్థినిగా టిడిపి తరపున యార్లగడ్డ అక్షిత నామినేషన్.



**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 18**:ఏలేశ్వరం మున్సిపాలిటీ టిడిపి తరపున చైర్మన్ అభ్యర్థినిగా యార్లగడ్డ అక్షిత ఆదివారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో యార్లగడ్డ అక్షితతో పాటు కూటమి పార్టీల 28వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా ఏలేశ్వరం మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న యార్లగడ్డ అక్షిత, కూటమి చైర్మన్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పెచ్చేట్టి విజయలక్ష్మి, కూటమి నాయకులు మేడిశెట్టి బాబీ, జ్యోతుల పెదబాబు, గొల్లపల్లి బుజ్జి, బొదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి, గట్టెం వెంకటరమణ, వరుపుల సూరిబాబు, వరుపుల రాజబాబు, రుచి రమేష్, వాగు రాజేష్, జొన్నాడ వీరబాబు,కరణం సుబ్రహ్మణ్యం, గంగిరెడ్ల మణికంఠ, తలపంటి బుజ్జి, పలివెల వెంకటేష్, అనంతారపు రాజు తదితరులు పాల్గొన్నారు.

## భద్రగిరి ఆలయంలో వైభవంగా దుర్గాష్టమి ఉత్సవాలు



**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 18 పెన్ పవర్.**మండల కేంద్రంలోని భద్రగిరి రామలింగేశ్వర స్వామి ఆలయంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో,వైభవంగా నిర్వహిస్తున్నారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి నామస్మరణ చేస్తూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు.అనంతరం దుర్గాదేవికి భక్తిశ్రద్ధలతో మహా నైవేద్యం సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు.లోక కల్యాణం,కుటుంబాల సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు.మహా నైవేద్యం సమర్పించిన అనంతరం ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు భక్తితో పూజా కార్యక్రమాల్లో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.అమ్మవారి నామస్మరణలు,భక్తుల సందడితో ఆలయంలో పండుగ వాతావరణం నెలకొంది.స్థానిక మహిళలు,భక్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిమయంగా కొనసాగాయి.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా:15వ వార్డు వైఎస్ఆర్సీపీ అభ్యర్థి మొల్లి హేమంత్



**విశాఖ తూర్పు,పెన్ పవర్,అక్టోబర్ 18:**విశాఖ తూర్పు నియోజకవర్గం పరిధిలోని జీవీఎంసీ 15వ వార్డులో వైఎస్ఆర్సీపీ బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థి మొల్లి హేమంత్ ఆదివారం పార్వతి నగర్ బి ఆర్ టి ఎస్ ప్రాంతాలలోఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు తమ సమస్యలను వివరించారు. వార్డులోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా అభ్యర్థి తెలిపారు.ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు గొలగాని శ్రీనివాస్, కన్నేటి సుబ్బారెడ్డి,సత్తి మందారెడ్డి,బోర సూర్యనారాయణ,కాళ్ల సూరిబాబు,అప్పలనాయుడు, సుజాత,సఖిన,మణిదీప్ తదితరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సేవే పరమార్థం:గా ప్రజా సంక్షేమానికి కృషి చేస్తా:

**14వ వార్డు కూటమి టీడీపీ అభ్యర్థి కాకి గంగరాజు నామినేషన్ దాఖలు**



**విశాఖ తూర్పు,పెన్ పవర్,అక్టోబర్ 18:** విశాఖ తూర్పు నియోజకవర్గం పరిధిలోని 14వ వార్డు నుంచి కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాకి గంగరాజు (కేటరింగ్ రాజు) ఆదివారం తన నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కు ముందు కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి వార్డులో ప్రచారం నిర్వహించి, అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రజా సంక్షేమం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.తాను ఇప్పటికే చేస్తున్న సేవా కార్యక్రమాలకు తోడు కార్పొరేటర్ బాధ్యతలు చేపడితే వార్డు అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు వెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు సారిపల్లి రాము, ముగడ రాజారావు, శ్రీజ్యోతి, రాజేశ్వరి,వార్డు ఇన్‌చార్జ్ రాగతి అచ్యుతరావు,బీజేపీ నాయకులు మధుపాద సన్యాసిరావు,ఈ అప్పారావు, ముదిండి కృష్ణంరాజు,రేఖ తదితరులు, కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలు, జనసేన అభిమానులు పాల్గొన్నారు.

## 16వ వార్డులో కూటమి అభ్యర్థిగా ఏడువాక శ్రీమహాలక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు





**విశాఖ తూర్పు పెన్ పవర్, అక్టోబర్ 18,**జీవీఎంసీ 16వ వార్డు నుంచి కూటమి బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థిగా ఏడువాక శ్రీమహాలక్ష్మి సన్యాసిరావు శనివారం నామినేషన్ దాఖలు చేశారు.విశాఖ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాలతో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.నామినేషన్ కు ముందు 16వ వార్డులో కూటమి నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం వారిలో ఆఖరి బస్టాప్ నుండి దుర్గ బజార్,దుర్గనగర్, నెహ్రూ నగర్ పాండురంగాపురం ప్రాంతాలలో ప్రచారాన్ని నిర్వహించారు.జీవీఎంసీ ఈస్ట్ జోన్ కార్యాలయంలో ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి,ఉపాధ్యక్షులు మారిక జక్కన్న,కిల్లంశెట్టి శ్రీనివాసరావు,వడిసెల శ్రీను, ఎస్సీ సెల్ అధ్యక్షులు పట్టా నూకరాజు, ఓసెట్టి గురుమూర్తి, కరణం సంజీవరావు,వార్డు మహిళా ప్రధాన కార్యదర్శి కర్రి మణి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,16వ వార్డు అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# ఎన్నికల కోడ్ అమలు.. డిసెంబర్ 2 వరకు పీజీఆర్ఎస్ రద్దు

- అక్టోబర్ 19న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణ లేదు
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి నేపథ్యంలో నిర్ణయం
- జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ అక్టోబర్ 18:**స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున డిసెంబర్ 2వ తేదీ వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున అక్టోబర్ 19వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన పీజీఆర్ఎస్ కార్యక్రమం జరగదని స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళి డిసెంబర్ 2వ తేదీ వరకు అమలులో ఉండనున్నందున అప్పటివరకు పీజీఆర్ఎస్ కార్యక్రమాల నిర్వహణను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ఫిర్యాదుల పరిష్కారం కోసం కార్యాలయాలకు రావద్దని, అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

**జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు**

దసరా నవరాత్రులు, విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ కె. దినేష్ కుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, ఆరోగ్యం, శాంతి, సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. విజయదశమి స్ఫూర్తితో ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని, పరస్పర సహకారంతో సమాజ అభ్యున్నతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ కె. దినేష్ కుమార్ కోరారు.

## కొవ్వూరులో నామినేషన్ల ప్రక్రియ పరిశీలన

- ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలి
- ఎం గౌతమి



**కొవ్వూరు, పెన్ పవర్, అక్టోబర్ 18:**తూర్పుగోదావరి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించిన ప్రత్యేక పరిశీలకురాలు ఎం.గౌతమి ఆదివారం కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఏర్పాట్లు, నామినేషన్ల స్వీకరణ విధానం, ఎన్నికల నిబంధనల అమలుపై అధికారులకు పలు సూచనలు చేశారు.నామినేషన్ల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని, అభ్యర్థులకు నిబంధనలపై స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులపై నిబంధనల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, ఇతర అంశాలపై ప్రత్యేక పరిశీలకురాలు ఎం.గౌతమిని 8977935065 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, అడిషనల్ ఎస్పీ తరుణ్ పహ్వా, కొవ్వూరు ఆర్డీవో కె.ఆనందరావు, మున్సిపల్ కమిషనర్ గ్రంథి సందీప్, తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్, ఎంపీడీవో వెంకటరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పోలవరం జిల్లాలో పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- ప్రతి మండలానికి సహాయ పర్యాటక అభివృద్ధి అధికారి నియామకం
- హోమ్‌స్టేల నిర్వహణ, పర్యాటక కార్యకలాపాలపై ప్రత్యేక పర్యవేక్షణ
- గిరిజన సంస్కృతి, ప్రకృతి అందాలకు ప్రపంచస్థాయి గుర్తింపే లక్ష్యం
- స్థానిక యువతకు ఉపాధి అవకాశాల పెంపునకు ప్రాధాన్యం
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 18:**పోలవరం జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ వెల్లడించారు. జిల్లాలో పర్యాటక కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు హోమ్‌స్టేల నిర్వహణ, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, స్థానికులకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రతి మండలానికి ఒక సహాయ పర్యాటక అభివృద్ధి అధికారిని (ఏటీడీఓ) నియమిస్తూ సర్క్యులర్ జారీ చేసినట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లా పర్యాటక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, మండలి ఛైర్మన్‌గా తాను ఆమోదించిన ప్రతిపాదనల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. పరిశ్రమల శాఖలో అమలవుతున్న అసిస్టెంట్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ (ఏఐపీఓ) వ్యవస్థ తరహాలోనే పర్యాటక రంగంలోనూ మండల స్థాయి పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత మండలాల్లో విధులు నిర్వహిస్తున్న ఏఐపీఓలను సహాయ పర్యాటక అభివృద్ధి అధికారులుగా నామినేట్ చేయనున్నట్లు వెల్లడించారు.

**హోమ్‌స్టేలపై ప్రత్యేక నిఘా.. పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు**

మండల స్థాయిలో నియమితులయ్యే సహాయ పర్యాటక అభివృద్ధి అధికారులు తమ పరిధిలోని హోమ్‌స్టేల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే నమోదైన హోమ్‌స్టేల పనితీరును పరిశీలించడంతో పాటు కొత్త హోమ్‌స్టేల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. పర్యాటకులకు భద్రత, నాణ్యమైన సేవలు, మెరుగైన సౌకర్యాలు అందేలా ప్రభుత్వ మార్గదర్శకాలు, భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని స్పష్టం చేశారు.

**గిరిజన సంస్కృతి, ప్రకృతి అందాలకు ప్రత్యేక గుర్తింపు**

పోలవరం జిల్లాలోని అపారమైన ప్రకృతి సంపద, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, పర్యావరణ పర్యాటక ప్రాంతాలను విస్తృతంగా ప్రచారం చేసి పర్యాటకులను ఆకర్షించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. స్థానిక పర్యాటక ఆకర్షణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పర్యావరణ పర్యాటకం, చారిత్రక, వారసత్వ ప్రదేశాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు, స్వయం సహాయక సంఘాలు, పర్యాటక రంగ పారిశ్రామికవేత్తలు, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పర్యాటక రంగాన్ని మరింత విస్తరించాలని తెలిపారు.

**పర్యాటకాభివృద్ధితో స్థానికులకు ఉపాధి**

పర్యాటక రంగం అభివృద్ధి చెందడం ద్వారా గిరిజన ప్రాంతాల్లోని యువత, మహిళలు, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా హోమ్‌స్టేలు, స్థానిక పర్యాటక సేవలు, సంప్రదాయ కళలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పర్యాటక అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ఏటీడీఓలు కీలక పాత్ర పోషించాలని తెలిపారు.

**ప్రతి నెలా పురోగతి నివేదికలు సమర్పించాలి**

మండల పరిధిలో చేపడుతున్న పర్యాటక కార్యకలాపాలు, హోమ్‌స్టేల వివరాలు, పర్యాటక అభివృద్ధికి సంబంధించిన గణాంకాలను సేకరించి ప్రతి నెలా జిల్లా పర్యాటక అధికారికి పురోగతి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక రంగానికి సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు.ఏటీడీఓలు జిల్లా పర్యాటక అధికారి పరిపాలనా నియంత్రణలో పనిచేస్తూ పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల అధికారి, సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.

**ఉత్తర్వులు తక్షణమే అమలు చేయాలి**

పోలవరం జిల్లాను రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు మండల స్థాయి పర్యవేక్షణ వ్యవస్థ కీలకంగా మారనుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. సహాయ పర్యాటక అభివృద్ధి అధికారుల నియామక ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి, అమలు వివరాలతో కూడిన నివేదికను జిల్లా పర్యాటక మండలికి సమర్పించాలని జిల్లా పర్యాటక అధికారి, జిల్లా పరిశ్రమల అధికారి, సంబంధిత ఎంపీడీఓలను ఆదేశించారు. ఈ మేరకు జారీ చేసిన సర్క్యులర్ తక్షణమే అమల్లోకి వస్తుందని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టం చేశారు.

## ఎన్నికల కోడ్ ముగిసే వరకు పీజీఆర్ఎస్ రద్దు

కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 18:**స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినందున నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. అక్టోబర్ 14 నుంచి డిసెంబర్ 2 వరకు మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ ముగిసే వరకు పీజీఆర్ఎస్ రద్దుచేస్తున్నట్లు స్పష్టం చేశారు. తదుపరి ప్రకటన వెలువడే వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించమని స్పష్టం చేశారు. ఈ మార్పు ను ప్రజలు గమనించాలని కోరారు.

## ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ ను మర్యాదపూర్వంగా కలిసిన ఎస్పీ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, అక్టోబర్ 18:**తూర్పుగోదావరి జిల్లా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) డి.నరసింహ కిషోర్ ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ ఎం.గౌతమి ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అబ్జర్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాలో ఎన్నికల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై వారు చర్చించారు.

## లో బీఎంఐ కేసులకు టీబీ పరీక్షలు నిర్వహించాలి

- డీఎల్‌ఏటీఓ డా ఎన్ వసుంధర



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,అక్టోబర్ 18:**తూర్పు గోదావరి జిల్లాలో క్షయవ్యాధి (టీబీ) నియంత్రణ చర్యలను పటిష్ఠంగా అమలు చేయాలని డీఎల్ఏటీఓ డాక్టర్ వసుంధర సూచించారు. జిల్లాలోని కంబాలపేట, అంబేడ్కర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (యూపీహెచ్‌సీ) సందర్శించి, వైద్య సేవలు, టీబీ గుర్తింపు, వ్యాధి నియంత్రణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా నేషనల్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ (ఎన్‌టీఈపీ) రిజిస్టర్లు, టీబీ కేస్ కార్డులు, టీబీ లేబొరేటరీ రిజిస్టర్లు, జాతీయ కుష్ఠ వ్యాధి నిర్మూలన కార్యక్రమం (ఎన్‌ఎల్ఈపీ) రికార్డులను తనిఖీ చేశారు. టీబీ లేబొరేటరీ రిజిస్టర్లను సక్రమంగా అప్‌డేట్ చేయాలని, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందికి సూచించారు.అన్ని వైద్యాధికారులు తక్కువ బాడీ మాస్ ఇండెక్స్ (లో బీఎంఐ) ఉన్న వ్యక్తుల వివరాలతో సమగ్ర జాబితాను నిర్వహించాలని ఆదేశించారు. లో బీఎంఐ ఉన్న ప్రతి ఒక్కరికీ టీబీ లక్షణాలు, వ్యాధి ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన స్క్రీనింగ్ నిర్వహించాలని, అవసరమైన వారికి కఫం (స్పుటమ్) పరీక్షలు చేయించి టీబీని సకాలంలో గుర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోటీబీ అనుమానితుల గుర్తింపు, పరీక్షలు, రికార్డుల నిర్వహణలో నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ వసుంధర స్పష్టం చేశారు.

## ఎన్నికల కోడ్ ... 

## అమరజీవి ఈలి ఆంజనేయులు శత జయంతి వేడుకలు.

**పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఈలి నాని, మాజీ ఎమ్మెల్యే కొట్టు, బాబ్జి.**



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 18.**తాడేపల్లిగూడెం పోలీస్ ఐలాండ్ సెంటర్ వద్ద మాజీ ఎమ్మెల్యే ఈలి నాని ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం రూపశిల్పి, అమరజీవి ఈలి ఆంజనేయులు గారి శత జయంతి వేడుకల ఉత్సవాలు పురస్కరించుకుని, నిర్వహించిన కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ఉ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ, వలవల బాబ్జి,తాతాజీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈలి ఆంజనేయులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తాడేపల్లిగూడెం అభివృద్ధికి ఆయన అందించిన సేవలను, ప్రజా జీవితంలో ఆయన పోషించిన పాత్రను స్మరించుకున్నారు. శత జయంతి ఉత్సవంలో ఆయన కుమారుడు, మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవన ఇతర నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి , వైసిపి ఇన్చార్జి వడ్డీ రఘురాం నాయుడు , టైలర్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి , పైబోయిన రఘు , అడబాల నారాయణమూర్తి , జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి, తెలుగుదేశం పట్టణాధ్యక్షుడు పట్నాల రాంపండు , జంగా శ్రీనివాసా రామ రాయ్, మారిశెట్టి సుబ్బారావు , సబ్బినీసు కృష్ణమోహన్, పేరిచర్ల మురళీకృష్ణంరాజు , పప్పుపుల కుమారస్వామి నాయుడు, గార్లపాటి వీరకుమార్, లింగంపల్లి కృష్ణ, పసల అచ్యుతం ఈలి కిషోర్ , ఈలి సత్యనారాయణ, లింగంపల్లి గాంధీ , పుల్లా బాబి అడ్డగర్ల సురేష్ , మేన నానాజీ, గాజుల గోపికృష్ణ, తాటికాయల వీరన్న , సుంకర ధన బాబు, బండారు నాగు తదితరులు పాల్గొన్నారు.యాలి ఆంజనేయులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించరు.

**ఆటో డ్రైవర్ లకు యూనిఫాం పంపిణీ చేసారు.**

అనంతరం వివిధ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు , ఏలూరు రోడ్డులో వినాయకుని గుడి వద్ద 5000 మందికి అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.

## శ్రీశ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి, అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్.18** దేవీ నవరాత్రుల సందర్భంగా తాడేపల్లిగూడెం పట్టణంలోని ఏలూరు బస్ స్టాండ్ సమీపంలో ఉన్న శ్రీశ్రీశ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ప్రత్తిపాడు శ్రీ కనకదుర్గమ్మ అమ్మ ను ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ఉ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, తాడేపల్లిగూడెం నియోజకవర్గం సుభిక్షంగా ఉండి మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పైడితల్లి అమ్మవారికి వెండి కిరీటం సమర్పణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 18:**తుమ్మలోవలోని శ్రీ పైడితల్లి అమ్మవారి దివ్య సన్నిధిలో వెండి కిరీటం సమర్పణ కార్యక్రమంఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హితకారిణి సమాజం చైర్మన్ డాక్టర్ యాళ్ల ప్రదీప్ కుటుంబ సభ్యులు అమ్మవారికి భక్తితో చేయించిన వెండి కిరీటాన్ని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఆయన సతీమణి, మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించు కున్నారు. అమ్మవారికి వెండి కిరీటాన్ని సమర్పించడం యళ్ల తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులు పొందారు. పైడితల్లి అమ్మవారి దివ్య సన్నిధిలో భక్తులకు ఆధ్యాత్మికత పంచింది. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలకీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

# పులివెందుల స్థానిక పోరు.. జగన్‌కు బిగ్ టెస్టే..!



వైసీపీ అధినేత జగన్ సొంత నియోజకవర్గం పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియ భారీ ట్విస్టులతో ముడిపడిందనే చెప్పాలి. వైసీపీ తరపున ఇప్పటికే మహిళ నాయకురాలు, జగన్ బంధువు టికెట్ సంపాదించుకున్నారు. నామినేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఇక, టీడీపీ కూడా ఈ సీటును మహిళకు ఎంపిక చేశారు. దీంతో వైసిపి- టిడిపి మహిళా నాయకురాళ్ల మధ్య తీవ్రస్థాయిలో పోటీ అయితే ఉండనంది. ఇందులో ప్రధానంగా గమనించాల్సింది పులివెందుల మున్సిపాలిటీని దక్కించుకోవడం జగన్ కి ఇప్పుడు అత్యంత కీలకం.రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పరిస్థితి దారుణంగా ఉన్న నేపథ్యంలో తన సొంత నియోజకవర్గంలో మున్సిపాలిటీని తన ఖాతాలో వేసుకోకపోతే అది మరింత ఇబ్బందికర పరిణామాలు సృష్టించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల పరిస్థితులను చూసుకుంటే ఇరుపక్షాల మధ్య కూడా దాడులు జరిగాయి. అలాగే మాటల తూటాలు.. వ్యూహ ప్రతివ్యూహాలు కూడా ఇరు పక్షాల మధ్య కామన్ గా మారిపోయింది. మహిళా నాయకులు పోటీలో ఉన్న నేపథ్యంలో ఈ ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందా.. లేకపోతే సర్దుబాటు అవుతాయా అనేది చూడాలి.

కానీ అటు వైసిపి ఈ ప్రాంతాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి తీరాలన్న వ్యూహంతో ముందుకు సాగుతూ ఉండడం గమనార్హం. అలాగే టిడిపి కూడా జగన్ నియోజకవర్గంలో తాము పాగా వేయాలని నిర్ణయించుకున్న క్రమంలో ఏం జరుగుతుందన్నది ఆసక్తిగా మారింది. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి తీరాలన్న వ్యూహాన్ని టిడిపి వైసిపిలు అనుసరిస్తున్నాయి. వైసీపీ తరఫున బరిలోకి దిగిన జగన్ చిన్నమ్మ వైయస్ ప్రమీల టిడిపి అభ్యర్థిగా ప్రకటించిన తుగుట్ల గీతా కుమారి ఇద్దరు సీనియర్ నాయకులు కావడం గమనార్హం.

అంతేకాదు.. ఇరువురికి స్థానికంగా బలమైన ఫాలోయింగ్ ఉండడం వంటివి కీలకంగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం టిడిపికి స్థానికంగా మద్దతు ఎక్కువ కనిపిస్తోంది. బీటెక్ రవి వ్యూహాలు అదేవిధంగా టిడిపి అధిష్టానం అనుసరిస్తున్న పద్ధతులు వంటివి ఈ నియోజకవర్గంలో ప్రభావం చూపించే అవకాశం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రమీలమ్మ రంగంలోకి దిగడంతో వైఎస్ ఫ్యామిలీ ప్రభావం కూడా ఉంటుందన్నది పరిశీలకులు అంటున్నారు. మరి ఏం జరుగుతుందని చూడాలి. ఏది ఏమైనా జగన్‌కు ఇది అత్యంత సవాలుగా మారనుందన్నది ఖాయం.

# ఏపీ లోకల్ వార్ ఇంకా ట్విస్టులు ఉన్నాయ్.. వీళ్లకు బిగ్ టెస్ట్... !



స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన శుక్రవారం నాడు రాయలసీమ జిల్లాల్లోని రాజంపేట పార్లమెంటు పరిధిలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా రాయచోటి, పుంగనూరు నియోజకవర్గాల్లో టిడిపి వైసిపి వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణలు తారా స్థాయికి చేరాయి. కనీసం నామినేషన్ వేసే పరిస్థితి కూడా లేదన్న వాదన బలంగా వినిపించేలా చేసింది. దీనిపై పోలీసులు సీరియస్ గా స్పందించారు. తాజాగా 70 మందిపై కేసులు పెట్టారు. ఇంకా వందల మంది ఈ దాడుల్లో పాల్గొన్నారని భావిస్తూ.. వారి వివరాలను సేకరిస్తున్నారు. అయితే ఈ ఘర్షణలు ఇక్కడితో ఆగిపోయినట్టేనా ఇక అంతా ప్రశాంతంగా జరుగుతుందా అంటే దీనికి సమాధానం లేదు. ఎందుకంటే ఇంకా బలమైన, వివాదాస్పదమైన నియోజకవర్గాలు చాలా ఉన్నాయి. వాటిలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారుతున్నాయి. నువ్వా నేనా అన్నట్టుగా ఉన్న ఆయా నియోజకవర్గాల్లో మరిన్ని ట్విస్టులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. వీటిలో ప్రధానంగా తాడిపత్రి, ఆళ్లగడ్డ, కర్నూలు, ఒంగోలు, చీరాల, బాపట్ల ఇట్లా అనేకమైన సమస్యాత్మక ప్రాంతాలు కనిపిస్తున్నాయి.

వీటిలో కూడా టిడిపి- వైసిపిల మధ్య చిరకాల ఘర్షణలు చోటు చేసుకుంటాయన్న అంచనాలు ఉన్నాయి. అలాగే మాచర్ల, గురజాల వంటి పల్నాడు ప్రాంతాల్లో సీట్లు కూడా హాట్ హాట్ గా ఉన్నాయి. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లోని వైసిపి నాయకులను పోలీసులు హౌస్ అరెస్టులు చేయటం ఆంక్షలు విధించడం వంటివి ఉన్నప్పటికీ.. ఏ క్షణంలో ఏం జరుగుతుందని చెప్పడం కష్టంగా మారుతోంది. మరోవైపు టిడిపి నాయకులు కూడా ఏం జరిగినా ఫర్వాలేదు.. అనే రీతిలో నామినేషన్ కేంద్రాలకు వెళ్లే పరిస్థితి నెలకొంది.

దీనికి ప్రధానంగా దీర్ఘకాలంగా ఉన్న విభేదాలు, రాజకీయంగా జరుగుతున్న పరిణామాలు వంటిపై కారణాలని పరిశీలకులు భావిస్తున్నారు. నిజానికి కొన్ని ప్రాంతాలకు మాత్రమే ఒకప్పుడు పరిమితమైన

సమస్యలు ఇప్పుడు దాదాపు సగానికి పైగా నియోజకవర్గాలకు పాకడం ఆయా ప్రాంతాల్లో తీవ్రస్థాయి ఘర్షణలు చోటు చేసుకోవడం వంటివి చర్చనీయాంశంగా ఉన్నాయి. ఇరుపక్షాల్లోనూ పట్టుదల, ఆగ్రహం, ఒకరిపై ఒకరు ఆధిపత్యం చలాయించాలన్న ధోరణే కనిపిస్తోంది తప్ప ఎన్నికలను ప్రశాంతంగా ముందుకు తీసుకు వెళ్లాలన్న ఆలోచన కొరవడింది అన్నది వాస్తవం.

దీనిని పరిష్కరించేందుకు ఇరుపక్షాలు సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలి. ముఖ్యంగా పులివెందుల, కుప్పం వంటి నియోజకవర్గాల్లో పరిస్థితులు మరింత దారుణంగా ఉండే అవకాశం ఉందని పోలీసులు ముందుగానే భావిస్తున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రక్రియను సవాల్‌గా తీసుకుంటున్నారు. మరి ఏం జరుగుతుందనేది చూడాలి. ప్రస్తుతం అయితే సమస్యాత్మక ప్రాంతాలు పెరుగుతున్నాయి. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఏ మేరకు ఫలిస్తాయి అన్నది ఆందోళన గానే ఉంది.

# నామినేషన్ల చివరి రోజు ట్విస్టు.. మూడు చోట్ల వైసీపీకి షాక్

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. ఆ తర్వాత సమయం మించిపోయిందని పలుచోట్ల అభ్యర్థులను వెనక్కి పంపారు. రాష్ట్రంలో మొత్తం వంద పట్టణ సంస్థలకు నామినేషన్లు స్వీకరించారు. ఇందులో 13 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. అయితే రాయలసీమతోపాటు ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులతో నామినేషన్ల ప్రక్రియకు ఆటంకం కలిగింది. మిగిలిన ప్రాంతంలో సజావుగా ముగిసింది. అధికార, విపక్షాల మధ్య ఘర్షణలతో రాయచోటి, దర్శి, పిడుగురాళ్లలో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయారని చెబుతున్నారు.



మున్సిపల్ ఎన్నికల్లో తొలి ఘట్టం ముగిసింది. ఈ నెల 14న షెడ్యూల్ విడుదల కాగా, 16వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించారు. సోమవారం నామినేషన్లను పరిశీలిస్తారు. 21వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఆ తర్వాత అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తారు. 26వ తేదీవరకు అభ్యర్థులు ప్రచారం చేసుకునేందుకు గడువు ఉంది. 28న పోలింగ్, 30న ఫలితాలు విడుదల అవుతాయి. మూడు రోజులుగా వంద పట్టణ సంస్థల్లో నామినేషన్లు స్వీకరించగా, రాయలసీమలోని ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లో పలుచోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి.తొలిరోజు పుంగనూరులో మొదలైన గొడవ పులివెందులలో పతాకస్థాయికి చేరింది. చివరికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సైతం జోక్యం చేసుకోవాల్సివచ్చింది. ఈ పరిణామాల మధ్యే ఆదివారం పలుచోట్ల ఘర్షణలు జరుగుతుండగానే వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి ప్రయత్నించినట్లుగా చెబుతున్నారు. అయితే మధ్యాహ్నం మూడు గంటలలోపు నామినేషన్ కేంద్రంలోకి వచ్చిన వారికే అధికారులు అనుమతిచ్చినట్లుగా చెబుతున్నారు. దీంతో రాయచోటిలో వైసీపీ చైర్మన్ అభ్యర్థితోపాటు కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయలేకపోయారని అంటున్నారు.రాయచోటిలో మూడు రోజులుగా ఘర్షణలు కొనసాగుతున్నాయి. 16వ తేదీన వైసీపీ కార్యాలయంలో వాహనాలకు గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. అప్పుడు మొదలైన ఉద్రిక్తతలు మూడు రోజు వరకు కొనసాగాయి. ఈ పరిస్థితుల్లో వైసీపీ అభ్యర్థులు నామినేషన్ కేంద్రానికి సమయం లోగా వెళ్లలేకపోయారని అంటున్నారు. ఇక దర్శిలోనూ ఇదే పరిస్థితి నెలకుందని చెబుతున్నారు. దర్శిలో నామినేషన్ వేయలేక 25 మంది అభ్యర్థులు వెనుదిరిగారు. పిడుగురాళ్లలో వైసీపీ చైర్మన్ అభ్యర్థి 20 నిమిషాలు ఆలస్యంగా రావడంతో ఎన్నికల అధికారులు అనుమతించలేదు.ఈ పరిణామాలతో మూడు చోట్ల వైసీపీ పోటీ లేకుండానే మున్సిపల్ ఎన్నికలు జరిగే పరిస్థితి ఉందని అంటున్నారు. అయితే అక్కడ ఇప్పటికే నామినేషన్ వేసిన అభ్యర్థులకు వైసీపీ మద్దతు ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఇదే సమయంలో టీడీపీ కూటమికి వ్యతిరేకంగా నామినేషన్లు వేసిన వారితో ఉపసంహరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. మొత్తానికి తొలి ఘట్టం ముగియడంతో నామినేషన్ల ఉపసంహరణకు ఒత్తిళ్లు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో రాజకీయం ఉత్కంఠ రేపుతోందని అంటున్నారు.

# నెల్లూరులో రూప్‌కుమార్‌కు లక్కు చిక్కేనా.. ?



నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఎవరు ఊహించని విధంగా టిడిపి అధినేత చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. గత ఎన్నికల తర్వాత టిడిపిలోకి వచ్చిన రూపు కుమార్ కు మేయర్ స్థానం అప్పగించారు. నిజానికి ప్రస్తుతం మంత్రిగా ఉన్న నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వంటి బలమైన నాయకులు చేసిన లాబీయింగ్ కూడా పక్కనపెట్టి చంద్రబాబు రూప్ కుమార్ కు అవకాశం కల్పించారు. ఇది ఒక రకంగా ఆయనకు లక్ అనే చెప్పాలి. అయితే, అసలు సమస్య ఇప్పుడే మొదలైంది. అంతర్గతంగా రూప్ కుమార్ చుట్టూ విభేదాలు ముసురుతున్నాయి.టీడీపీ కీలక నాయకులు ఆయన ఎంపికను తీవ్రంగా విభేదిస్తున్నారు. స్థానికంగా తీవ్ర ఆరోపణలు ఉన్న రూప్ కుమార్ కు టికెట్ ఇవ్వడం పట్ల సీనియర్ నాయకులు గుస్సాగా ఉన్నారు. ముఖ్యంగా మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సైతం రూప్ కుమార్ ఎంపికపై మౌనంగా ఉండిపోయారు. పార్టీ పరంగా తీసుకున్న నిర్ణయం కావడంతో పార్టీ అధిష్టానానికి వ్యతిరేకంగా మాట్లాడడం ఇష్టం లేక వారు సైలెంట్ అయిపోయారు. కానీ, అంతర్గతంగా మాత్రం రూప్ కుమార్ ఎలా గెలుస్తాడో చూస్తామని ఒకరిద్దరు నాయకులు వ్యాఖ్యానించడం గమనార్హం.ఈ నేపథ్యంలో టికెట్ దక్కించుకున్నంత ఈజీగా రూప్ కుమార్‌కు గెలుపు సాధ్యం అవుతుందా అనేది ప్రశ్న. ముఖ్యంగా వైసిపి హయంలో రూపు కుమార్ వ్యవహరించిన తీరు, ఆయినపై వచ్చిన ఆరోపణలు వంటివి ఇప్పటికీ లైవ్ లోనే ఉన్నాయి. వాటిపై గతంలో టిడిపి సీనియర్ నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు. అలాంటిది ఇప్పుడు రూప్ కుమార్ కి అవకాశం ఇవ్వడం పై వారంతా ఆగ్రహంతో ఉన్నారు. అయితే పైకి మాత్రం ఎవరూ మాట్లాడటం లేదు. ఇది ఎన్నికల ప్రచారంపైన, అదేవిధంగా గెలుపు పైన కూడా ప్రభావం చూపించే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.మరీ ముఖ్యంగా టిడిపి క్యాడర్లో రూప్ కుమార్ పై పెద్దగా పాజిటివ్ చర్చ అయితే నడవడం లేదు. ఆయనను ఇప్పటికీ వైసీపీ నుంచి వచ్చిన నాయకుడిగానే చూస్తున్నారు. గతంలో స్థానికంగా పదవులు నిర్వహించి ఉన్నప్పటికీ బలమైన కేడర్‌ను ఆయన సంపాదించుకోలేకపోయారు. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కు స్వయానా బంధువు కావడం, ఆయన అనుచరులే ఈయనకి కూడా పనిచేస్తున్న నేపథ్యంలో ఇప్పుడు కూటమి పార్టీలను ఐక్యంగా చేయటం వారిని తనవైపు తిప్పుకోవటం అనేది రూప్ కుమార్ కు అత్యంత సంక్లిష్టమైన అంశంగా మారింది.నామినేషన్ వేయడం తేలికే కావచ్చు. కానీ, తీవ్రమైన పోటీలో గెలుపు గుర్రం ఎక్కడం అత్యంత ప్రధానమైన అంశం. దీనికి అన్ని వర్గాలు చేతులు కలపాల్సిన అవసరం ఉంది. కానీ, ప్రస్తుతం ఆయన పరిస్థితిని గమనిస్తే మంత్రి నారాయణ సహా సీనియర్ నాయకులు అందరూ సైలెంట్ అయిపోవడం రూప్ కుమార్ పట్ల పెద్దగా సానుకూల ధోరణి వ్యక్తం చేయకపోవడం వంటివి పెద్ద సమస్యగా మారుతున్నాయి. దీంతో రూప్ కుమార్ ఏ మేరకు విజయం దక్కించుకుంటారనేది చూడాలి.

# మళ్లీ రంగంలోకి బాబు.. సమస్యలు సెట్‌రైట్.. !



టిడిపి అధినేత చంద్రబాబు మళ్ళీ రంగంలోకి దిగుతున్నారా? పార్టీ నాయకులు కార్యకర్తలతో ఆయన వరుస పెట్టి సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నారా? అవసరమైతే జిల్లాల్లోనూ పర్యటించనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తాజాగా కూటమి పొత్తులో భాగంగా 20 స్థానాలకు పైగా మున్సిపల్ సీట్లను జనసేనకు కేటాయించారు. ఇది టిడిపి నాయకులు తప్పు పట్టకపోయినప్పటికీ తాము కోరుకున్న స్థానాలను లేదా తమకు బలంగా ఉన్న స్థానాలను జనసేనకు ఇవ్వడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా అసంతృప్తి వ్యక్తం అవుతోంది.సాలూరులో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఏకంగా కన్నీరు పెట్టుకున్న ఉదంతాలు, అలాగే శ్రీకాకుళం లో మాజీ మంత్రి, రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం వంటివి పార్టీలో హైలెట్ గా మారాయి. ఇవి ఒకరకంగా చిన్నవే అయినప్పటికీ ఎన్నికల సమయానికి కూటమిపై ప్రభావం చూపించే అవకాశం ఉందని చంద్రబాబు భావిస్తున్నారు. టిడిపిలో ఎంపికల విషయంలో కూడా తమ్ముళ్లు అసంతృప్తితో ఉన్నారు. తాము కోరుకున్న వారికి లేదా తాము ఆశించిన వారికి అవకాశం కల్పించలేదని అధిష్టానం పై ఒకింత ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇది ఇలా కొనసాగితే పార్టీకి నష్టం వస్తుందని భావిస్తున్న చంద్రబాబు.. నామినేషన్ల పర్వం పూర్తి కాగానే అంటే ఒకటి రెండు రోజుల్లోనే ఆయన పార్టీ నాయకులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించాలని భావిస్తున్నారు. అదేవిధంగా తానే స్వయంగా అవసరమైతే జిల్లాల్లో పర్యటించాలని కూడా నిర్ణయించుకున్నారు. తద్వారా ప్రస్తుతం నెలకొన్న అసంసత్తులు, సమస్యలు పరిష్కారం అవుతాయని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా టిడిపి గెలుపు ఓటముల కంటే కూడా కూటమిగా ఉన్న జనసేన పార్టీపై ఎక్కువగా చంద్రబాబు దృష్టి పెడుతున్నారనే చెప్పాలి.21 మున్సిపాలిటీ స్థానాలతో పాటు నాలుగు కార్పొరేషన్ స్థానాలను ఇచ్చిన నేపథ్యంలో వాటిలో ఆ పార్టీని గెలిపించుకోవడం ద్వారా కూటమిగా ఐక్యంగా ఉన్నామన్న సంకేతాలను బలంగా పంపించాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక చూస్తూ ఊరుకుంటే కుదరదని క్షేత్రస్థాయిలో ఏర్పడిన సమస్యలను తానే స్వయంగా పరిష్కరించాలని చంద్రబాబు నిర్ణయించుకున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు మంత్రులు.. జిల్లాల ఇన్చార్జి మంత్రులు కూడా స్థానికంగా ఉన్న క్యాడర్ కు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. కానీ ఈ సర్దుబాట్లు పెద్దగా ఫలించే అవకాశం కనిపించడం లేదని అంచనా వేస్తున్న నేపథ్యంలో కచ్చితంగా చంద్రబాబు రంగంలోకి దిగుతారని అంటున్నారు.

## ఐసీసీ ట్రోఫీ గెలవాలి.. పాకిస్థాన్‌పై తీవ్ర ఒత్తిడి: ఫఖర్ జమాన్ సంచలన వ్యాఖ్యలు



దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనున్న 2027 వన్డే ప్రపంచ కప్ కు ముందు పాకిస్థాన్ క్రికెట్ జట్టులో అంతర్గత మథనం మొదలైంది. ఇటీవల కాలంలో వరుస అంతర్జాతీయ పరాజయాలతో పాటు ఇంగ్లాండ్ పర్యటనలో క్లీన్ స్వీప్ ఎదుర్కొన్న పాక్ జట్టుపై అభిమానుల నుంచి విమర్శల వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో శ్రీలంక, ఇంగ్లాండ్‌లతో రవల్పిండి వేదికగా ఈరోజు (2026, అక్టోబర్ 18, ఆదివారం) ప్రారంభమయ్యే ముక్కోణపు వన్డే సిరీస్ ( తొలి మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ డాషింగ్ ఓపెనర్ ఫఖర్ జమాన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు.

**2017 నుంచి ఐసీసీ ట్రోఫీ లేక తీవ్ర ఒత్తిడిలో ఉన్నాం:**

పాకిస్థాన్ జట్టు 2017 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత ఇప్పటి వరకు ఒక్క ఐసీసీ ట్రోఫీ కూడా గెలవకపోవడంపై ఆటగాళ్లపై తీవ్ర ఒత్తిడి పెరిగిందని ఫఖర్ జమాన్ తెలిపాడు.

తీవ్ర నిరాశలో అభిమానులు: సుదీర్ఘకాలంగా మేము ఐసీసీ టైటిల్ సాధించకపోవడంతో దేశ ప్రజలు, అభిమానులు తీవ్ర నిరాశలో ఉన్నారని తెలుసు.జ మేము బాగా ఆడినప్పుడు ఎంత ప్రేమాభిమానాలు చూపిస్తారో, విఫలమైనప్పుడు అంతే అసంతృప్తి చెందుతారు.. ఈ ట్రోఫీ కరువుకు ముగింపు పలకడంపై జట్టులో నిరంతరం విస్తృత చర్చలు జరుగుతున్నాయని ఫఖర్ వ్యాఖ్యానించాడు.

**2027 ప్రపంచ కప్ గెలవడానికి ఫఖర్ ప్లాన్ ఇదిగో:**

రాబోయే వన్డే ప్రపంచ కప్ కోసం ఇప్పటి నుంచే సరైన తుది జట్టు కలయికను రూపొందించుకోవడం అత్యంత కీలకమని ఫఖర్ జమాన్ తెలిపాడు.

ఫస్ట్ క్లాస్ క్రికెట్ ప్రాధాన్యత: టీ20ల నుంచి నేరుగా వన్డే ఫార్మాట్‌కు మారడం చాలా కష్టమని, కానీ ఫస్ట్-క్లాస్ (రెడ్ బాల్) క్రీడలు ఆడి వన్డేల్లోకి రావడం వల్ల ఆటగాళ్లకు శారీరకంగా, మానసికంగా ఎంతో ఉపయోగపడుతుందని చెప్పాడు. ప్రస్తుత పాకిస్థాన్ ఆటగాళ్లంతా స్వదేశీ ఫస్ట్-క్లాస్ సీజన్ ఆడి మంచి ఫామ్‌తో ఈ ట్రై-సిరీస్‌లోకి అడుగుపెడుతున్నారని, ఇది 2027 వరల్డ్ కప్ వేటకు మంచి పునాది అని విశ్వాసం వ్యక్తం చేశాడు.

## వైభవ్ చానా మంచి ఆటగాడు.. కాస్త ఓపికతో ఉంటే ఛాన్స్‌లు వస్తాయి: శ్రేయస్ అయ్యర్



భారత టీ20 జట్టులో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ని వరుసగా బెంచ్ మీదనే కుర్చోబెట్టడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వెస్టిండీస్‌తో ఇటీవల ముగిసిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లోనూ వైభవ్‌కు తుది జట్టు లో ఆడే అవకాశం దక్కలేదు. ఈ ఏడాది జూలైలో ఇంగ్లాండ్‌పై అంతర్జాతీయ టీ20ల్లోకి అరంగేట్రం చేసిన సూర్యవంశీ, స్వదేశంలో ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయాడు. ఐర్లాండ్, అఫ్ఘనిస్థాన్, జపాన్, వెస్టిండీస్ సిరీస్‌లలో అతను బెంచ్ కే పరిమితమయ్యాడు.

**ఓపికతో వేచి చూడాల్సిందే: శ్రేయస్**

వెస్టిండీస్ సిరీస్ ముగిసిన అనంతరం భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. వైభవ్‌కు నేను ఎప్పుడూ చెబుతుంటాను.. నీకు అవకాశాలు తప్పకుండా వస్తాయి, నీ ప్రాసెస్, మైండ్‌సెట్‌ను సరిగ్గా ఉంచుకుని అవకాశాల గురించి ఎక్కువ ఆలోచించకూడదు.. కొన్నిసార్లు వేచి చూడక తప్పదు.. ప్రస్తుతం జట్టులో ఓపెనర్లుగా ఉన్న ఇద్దరు (అభిషేక్ శర్మ, సంజు శాంసన్) నిలకడగా రాణిస్తున్నారని శ్రేయస్ చెప్పుకొచ్చాడు.

**టీమిండియాపై కోచ్ మనీష్ ఓఝా ఫైర్:**

సూర్యవంశీకి అవకాశం ఇవ్వకపోవడంపై అతని చిన్ననాటి కోచ్ మనీష్ ఓఝా తీవ్రంగా మండిపడ్డాడు. ఈ చిన్న వయసులో ప్రతి మ్యాచ్ ఆడటం ద్వారానే ఆటగాడు మానసికంగా దృఢంగా మారతాడు, అతని గేమ్‌లో మెరుగులు దిద్దుకుంటాయి. కానీ అతను బయట కూర్చొని వాటర్ సీసాలు అందిస్తున్నాడు.. ప్రస్తుతం ఉన్న మేనేజ్‌మెంట్ నియంతృత్వంగా ప్రదర్శిస్తోందని ఆరోపించాడు.

**నెక్స్ట్ టార్గెట్ న్యూజిలాండ్ సిరీస్:**

ఏషియన్ గేమ్స్ 2026లో స్వర్ణ పతకం సాధించిన భారత జట్టులో భాగమైన సూర్యవంశీ, త్వరలోనే ప్రారంభం కానున్న న్యూజిలాండ్ ౨20 సిరీస్ కోసం పయనం కానున్నాడు. ఈ టూర్‌లోనైనా ఈ యంగ్ లెఫ్ట్ హ్యాండర్‌కు తుది జట్టులో అవకాశం దక్కుతుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

## ఒక్క పరుగుకే గిల్ ను వెనక్కిపంపిన ఛత్తీస్‌గఢ్ బౌలర్..



టీమిండియా టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు రంజీ ట్రోఫీ రీఎంట్రీ కలిసిరాలేదు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన అతను, ఛత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో దారుణంగా విఫలమయ్యాడు. పంజాబ్ తరఫున ఆడుతున్న గిల్, కేవలం ఒక్క పరుగు మాత్రమే చేసి పెవిలియన్‌కు చేరాడు. ఛత్తీస్‌గఢ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అజయ్ మండల్ అద్భుతమైన బంతితో అతడిని క్లీన్ బౌల్డ్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు.మొహాలీలోని కొత్త పీసీఏ స్టేడియంలో ఆదివారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టులో గిల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఇన్నింగ్స్ 27వ ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చిన అజయ్ మండల్.. తన మూడో బంతికే గిల్‌ను బోల్తా కొట్టించాడు. బంతి లైన్ ను అంచనా వేయడంలో పూర్తిగా విఫలమైన గిల్, దాన్ని అడ్డుకోలేకపోయాడు. బంతి నేరుగా బ్యాట్, ప్యాడ్ మధ్యలో నుంచి దూసుకెళ్లి మిడిల్ స్టంప్‌ను గిరాటేసింది. దీంతో కేవలం 5 బంతులు ఎదుర్కొని ఒక్క పరుగుకే గిల్ తన ఇన్నింగ్స్‌ను ముగించాడు.భారత జట్టు త్వరలో న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనున్న విషయం తెలిసిందే. ఈ కీలక పర్యటనకు ముందు రెడ్ బాల్ క్రికెట్‌లో తగినంత ప్రాక్టీస్ పొందాలనే ఉద్దేశంతోనే గిల్ ఈ రంజీ మ్యాచ్‌లో ఆడేందుకు నిర్ణయించుకున్నాడు. సీజన్‌లోని తొలి మ్యాచ్‌కు దూరంగా ఉన్న అతను, ఈ మ్యాచ్ కోసం ప్రత్యేకంగా అందుబాటులోకి వచ్చాడు. కానీ, ఊహించని విధంగా విఫలం కావడం అభిమానులను నిరాశపరిచింది.న్యూజిలాండ్ పర్యటనలో భారత జట్టు 5 వన్డేలు, 2 టెస్టులు ఆడనుంది. 2027 వన్డే ప్రపంచకప్‌కు సన్నాహకంగా, వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔిజ) ఫైనల్ రేసులో నిలవడానికి ఈ సిరీస్ భారత్‌కు చాలా కీలకం. అయితే, గిల్ తొలి మూడు వన్డేల్లో మాత్రమే ఆడి, టెస్ట్ సిరీస్‌కు సంసిద్ధం కావడానికి చివరి రెండు వన్డేలకు దూరం కానున్నట్లు సమాచారం.

ఇదిలా ఉండగా, మరోవైపు సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ బెంగాల్ తరఫున సర్వీసెస్‌తో జరుగుతున్న మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో సోదరుడు మహమ్మద్ కైఫ్ జట్టులోకి వచ్చాడు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత జట్టులో చోటు కోల్పోయిన షమీ, న్యూజిలాండ్ పర్యటనకు కూడా ఎంపిక కాలేదు. అయితే, దేశవాళీ క్రికెట్‌లో మాత్రం అతను నిలకడగా రాణిస్తున్నాడు.

## ఆరెంజ్ మూవీలోని ఒక్క సీన్ తీసుకొని సినిమా చేసిన యంగ్ డైరెక్టర్...సూపర్ హిట్ అయిందిగా..



పాలక్ తివారీ పర్పుల్ డే లుక్ అందరినీ ఆకట్టుకుంది

తెలుగు సినిమా ఇండస్ట్రీ సక్సెస్ ఫుల్ గా ముందుకు దూసుకెళ్తుంది. ప్రస్తుతం ఇండియా వైడ్ గా మన హీరోలకు ఉన్న క్రేజ్ నెక్స్ట్ లెవెల్ అనే చెప్పాలి. రామ్ చరణ్ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఆరెంజ్' సినిమా ఆశించిన మేరకు విజయాన్ని సాధించలేదు. మగధీర తర్వాత వచ్చిన సినిమా కాబట్టి ఈ మూవీ మీద భారీ హైప్ ఉండటంతో ఈ మూవీ ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయింది. మొత్తానికైతే ఈ సినిమా రిజల్ట్ తేడా కొట్టడంతో బొమ్మరిల్లు భాస్కర్ మీద తీవ్రమైన విమర్శలైతే వచ్చాయి. అప్పట్లో ఈ సినిమా ఫ్లాప్ అయినప్పటికి ఇప్పుడు మాత్రం కల్ట్ క్లాసిక్ సినిమాగా చెబుతున్నారు. రీ రిలీజ్ చేసినప్పుడు ఈ సినిమాని చూడడానికి యావత్ తెలుగు సినిమా ప్రేక్షకులంతా ఇంట్రెస్ట్ చూపించారు. మొదట మూవీ రిలీజ్ అయినప్పుడు ఆ టైమ్ లో ఉన్న ప్రేక్షకుల మైండ్సెట్ కి రీచ్ అవ్వలేదు. కానీ ఇప్పుడున్న జనరేషన్ కి ఈ సినిమా పర్ఫెక్ట్ గా మ్యాచ్ అయింది అంటూ చాలామంది సినీ విమర్శకులు సైతం కామెంట్లు చేయడం విశేషం...

**ఒక్క సీన్ తో సినిమానే వచ్చిందా**

ఆరెంజ్ సినిమాలో ఫోన్స్ ఎక్స్చేంజ్ చేసుకోవడం మీద ఒక సీన్ ఉంటుంది. అప్పట్లో ఫోన్ యూజ్ ఎక్కువగా లేదు. కాబట్టి ఆ ఫోన్ ఇచ్చే సీన్ పెద్దగా ఎఫెక్టివ్ గా అనిపించలేదు. కానీ ఇప్పుడున్న జనాలు ఫోన్ కి ఎక్కువగా అడిక్ట్ అయిపోయారు. ఒకరి ఫోన్లో ఎన్నో సీక్రెట్ లు ఉంటాయి. ఫోన్స్ ఇవ్వడానికి ఎవ్వరు ఇష్టపడరు. అదే పాయింట్ మీద యంగ్ డైరెక్టర్ అయిన ప్రదీప్ రంగనాథన్ 'లవ్ టుడే' సినిమా చేశాడు. ఈ సినిమా సూపర్ సక్సెస్ అయింది. ఆ థాట్ ఈ జనరేషన్ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే విధంగా ఉండడంతో సినిమా సూపర్ సక్సెస్ అయింది.

ఆరెంజ్ సినిమా అప్పుడు ఆడక పోవడానికి కారణం అప్పుడు ఫోన్లు వాడే వాళ్ళ సంఖ్య తక్కువగా ఉంది. అలాగే ఆ సన్నివేశం ప్రేక్షకులకు పెద్దగా ఎఫెక్టివ్ గా అనిపించలేదు. ఒక సినిమా సక్సెస్ అవ్వాలంటే అప్పుడు ఉన్న పరిస్థితులను బట్టి అప్పుడున్న ప్రేక్షకుల మెంటాలిటీని బేస్ చేసుకొని అందరికీ కనెక్ట్ అయ్యే విధంగా సినిమాని తెరకెక్కించాలి. అడ్వాన్స్డ్ ఆలోచనలతో సినిమాని తీస్తే కొన్ని సందర్భాల్లో సక్సెస్ ని సాధించవచ్చు కానీ అప్పుడున్న ప్రేక్షకుల మైండ్ సెట్ ప్రకారం ఆ సినిమా ఎక్కువ మందికి రీచ్ అయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి...





ప్రకృతి పావని షీర్ మెటాలిక్ గ్రే ఎన్‌సెంబుల్‌లో తలదాచుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com